TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

గురువారం, సెప్టెంబర్ 10, 2026 | సంపుటి - 20 | సంచిక 341 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## 13 రకాల విత్‌డ్రాలను 3 కేటగిరీలు

### పీఎఫ్ అడ్వాన్స్ రూల్స్‌లో కీలక మార్పులు

### 75 శాతం బ్యాలెన్స్ విత్‌డ్రాకు అనుమతి

న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ ఖాతా నుంచి నిధుల పాక్షిక ఉపసంహరణ (అడ్వాన్స్) నిబంధనలను సంస్థ గణనీయంగా సరళీకరించింది. గతంలో అమల్లో ఉన్న 13 రకాల సంక్లిష్ట ఉపసంహరణ పద్ధతులను రద్దు చేసి, వాటి స్థానంలో కేవలం తరువాయి 2లో

## ప్రజల జీవితాల్లో వెలుగు

# వచ్చేలా చేయటమే పాలన

### మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

### విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణకు శంకుస్థాపన

### మూడేళ్ల క్రితం జరిగిన అరెస్టు ఘటనను గుర్తు చేసుకున్న చంద్రబాబు

పి.గన్నవరం : కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం మాచవరంలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీరు జీవం అయితే భూమి జీవితం అన్నారు. అందుకే ఈ రెండు కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పుకొచ్చారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే... రాష్ట్రంపై తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నది నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లింది.ఆ నీటిని వినియోగించు కోగలిగితే మనందరికీ ఎంతో ప్రయోజనం కలిగేది. రాష్ట్ర సచివాలయానికి మాత్రమే పరిమితం కాకుండా... ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే పాలన. అందుకే ప్రతీ నెలలోనూ వీలైనన్ని సార్లు ప్రజల మధ్యకు వచ్చి వారి బాగోగులు తెలుసుకుంటున్నాను. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన పైనే ప్రధానంగా దృష్టి సారించి పాలన అందిస్తున్నాం. ప్రతీ నెలా మొదటి తేదీనే పేదల సేవలో పేరిట పెన్షన్ అందిస్తూ ప్రజల్ని కలుస్తున్నాను. పీ4తో సామాజిక భాద్యత కింద వారి జీవన ప్రమాణాలు పెంచే ప్రయత్నం చేస్తున్నాం. అభివృద్ధి చేయాలి, సంపద సృష్టించాలి. జీవన ప్రమాణాలు పెంచి అంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ హయాంలో తరువాయి 2లో

## ఏపీలో విద్యుత్ వాహనాలకు

# మరింత ప్రోత్సాహం

### ఈవీ పాలసీతో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు బలమైన పునాది

### విద్యుత్ వాహనాల కొనుగోలుపై 5 శాతం రాయితీ

### ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు

### - రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

తాడేపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న నిబద్ధతతో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. 2024-29 సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా విద్యుత్ వాహనాల తయారీదారులతో పాటు కొనుగోలుదారులకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్ల కొనుగోలుపై ఎక్స్‌షోరూమ్ ధరలో 5 శాతం వరకు రాయితీ కల్పించామని తెలిపారు. 2లో

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర

### బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు

### స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు

### ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం

### అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ

### కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

**అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు.**

హైదారాబాద్ : ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ 2లో

## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

### ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

### తెలంగాణలో అధికారంలోకి వస్తాం

### కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

హైదారాబాద్ : తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని 2లో

## యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

### ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్

### రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు

### సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..

### శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం

హైదారాబాద్ : యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరి స్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా 2లో

# స్టైఫండ్ డబుల్

### ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్

### స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ

### సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్.

### జీవో కాపి అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదారాబాద్ : ఆయుర్వేదం, హోమియో పతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు బుధ వారం మధ్యాహ్నం, సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి తరువాయి 2లో

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

### దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్

### ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్

### నాలుగు పరిధిలో 5మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు

### దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు

### 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం

### తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం

### 4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు

### పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం

### రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

### మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ : రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగు తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. 2లో

## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి టెస్టింగ్? కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్? పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అరక్కోణం- రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్- కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలం-కరూర్-దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యటక ప్రదేశాలకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(ఝార్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ- రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్? మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టుల ప్రణాళిక రచించారు. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు నిరంతరాయ అనుసంధానాన్ని అందిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. రైల్వే నెట్‌వర్క్ పెరగడం వల్ల దేశంలో చమురు దిగుమతులు తగ్గుతాయని అభిప్రాయపడింది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా అవుతుందని తెలిపింది. అలాగే, 62 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని పేర్కొంది.

## 13 రకాల విత్‌డ్రాలను 3 కేటగిరీలు

మూడు సులభతర విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం, ఈపీఎఫ్‌లో సభ్యత్వం పొంది 12 నెలలు పూర్తి చేసుకున్న చందాదారులు తమ ఖాతాలోని నిల్వలో 75 శాతం వరకు ఉపసంహరించు కోవచ్చు. అయితే, ఖాతాలో కనీసం 25 శాతం నిల్వను తప్పనిసరిగా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ గతంలోనే ఆమోదం తెలిపింది. తాజా సవరణల ప్రకారం, ఉపసం హరణ ప్రక్రియను మూడు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. అనారోగ్యం లేదా వైద్య చికిత్స నిమిత్తం సర్వీసు కాలంలో ఎన్నిసార్లయినా నిధులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే, చదువుల కోసం 10 సార్లు, వివాహ అవసరాల కోసం 5 సార్లు ఉపసంహ రణకు అనుమతి ఇచ్చారు. ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణాల చెల్లింపు లేదా ఇంటి మరమ్మతుల కోసం సర్వీసు మొత్తంలో ఐదుసార్లు అడ్వాన్స్ పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు, సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం లేదా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నిధులు ఉపసంహ రించుకునే వెసులుబాటు కల్పించారు.

## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. “నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు” అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## స్టైఫండ్ డబుల్

దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీఓ కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆయుష్ విద్యార్థులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శు భాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. యువతే దేశ భవిష్యత్తు.. విద్యార్థులే భావి పౌరులు అని మంత్రి అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజంలో గుణాత్మక మార్పుకు విద్య పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి, ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్ధిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసి, ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ హాస్పిటల్ ద్వారా ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. “మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది” అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర

చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా? నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు. అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని, వారికి కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సంధ్యారావు పోస్టు చేశారని, పదేళ్లు సీఎంగా ఉండి విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా? ప్రశ్నించారు. శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని, తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలని హితవు పలికారు. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని, దళితులను అవమానించిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా కూడా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కాదని, కులవివక్ష, అణచివేత చర్యలను ప్రజా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.

## ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే పాలన

మూడేళ్ల క్రితం జరిగిన అరెస్టు ఘటనను గుర్తు చేసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. నాడు జరిగిన ఘటనలను సభలో వివరించిన ముఖ్యమంత్రి జగన్ నైజాన్ని... జగన్ పైమాజీ సీఎం రోశయ్య వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఈ అంశాలపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ పాలకులు మూడేళ్ల క్రితం నన్ను అన్యాయంగా అరెస్టు చేసిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9 తేదీన నన్ను అన్యాయంగా అరెస్టు చేశారు. ఏ తప్పు లేకుండా అరెస్ట్ చేయడం బాధ కలిగించింది. 48 ఏళ్లుగా రాజకీయంలో ఉన్నాను. 31 ఏళ్ల క్రితం తొలిసారి సీఎం అయ్యాను. విలువలతో కూడిన రాజకీయం చేయాలని.. పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. చాలా మంది నాపై ఆరోపణలు చేశారు. కోర్టులకు వెళ్లారు. నాపై చేసిన ఆరోపణల్ని రుజువు చేయలేక పోయారు... అదే నా నిబద్ధత. రాజకీయంపై కుటుంబం ఆధారపడకూడదనే 36 ఏళ్ల క్రితం ఫ్యామిలీ బిజినెస్ ప్రారంభించాం. అప్పట్లో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున కుటుంబ వ్యాపారాన్ని నా సతీమణికి అప్పగించా. నాకు ధన వ్యామోహం లేదు. కేవలం తెలుగు జాతి బాగుండాలనే నేను నిరంతరం ఆలోచన చేస్తా. నంద్యాలలో ఓ సమావేశానికి వెళ్లిన నన్ను అరెస్టు చేస్తామని అర్ధరాత్రి వచ్చారు. నాపై ఆరోపణలు ఏమిటో చెప్పాలని అడిగితే... అరెస్టు చేసిన తర్వాత చెబుతామని అన్నారు. ఓ మాజీ ముఖ్యమంత్రిని ఉన్న పళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. నా జీవితంలో ఎన్నడూ అనుకోని సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగింది. నేను జైల్లో ఉన్న సమయంలో నాకేం జరుగుతుందోనని తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చింది. హైదరాబాద్‌లో కొందరు అడ్డుపడినా టెకీలు కూడా ముందుకు వచ్చి నిరసనలు తెలిపారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా కదలి వచ్చారు. పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారు. ఏమాత్రం వెనక్కు తగ్గకుండా పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపారు. గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయి. ఈడీ లాంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చింది. గతంలో అచ్చెన్నాయుడు లాంటి నేతల్ని బలవంతంగా అరెస్టు చేశారు. వేధింపులు చేశారు. పవన్ కళ్యాణ్ విశాఖ వెళ్తే ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కు పంపేశారు. ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. నేను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిముషం చాలు. కానీ నేను ఆ పని చేయలేదు. చాలా సౌమ్యంగా ఉంటానని, ఏం చేయలేకపోతున్నారని చాలా మంది అనేవారు. కానీ నాకు సహనం ఎక్కువ. నేను చేసే ఏ పని అయినా అది తెలుగు జాతికి న్యాయం జరగాలన్నదే నా లక్ష్యం. మాజీ సీఎం వైఎస్ఆర్ కు ఆయన కొడుకు విషయంలో జాగ్రత్తలు తీసుకోమని ఆనాడే చెప్పాను. గొడ్డలి పార్టీ అధ్యక్షుడ్ని ఆయన తండ్రి వైఎస్ఆర్ చదువుకోడానికి అమెరికా పంపిస్తే తిరుగుటపాలో వచ్చేశాడు... ఈ విషయం స్వయంగా వైఎస్సే చెప్పాడు. కొడుకుతో బాధలు భరించలేక అతన్ని వైఎస్సార్ బెంగళూరులోనే ఉంచారని తల్లి విజయమ్మ మాజీ సీఎం రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారు... రోశయ్యే స్వయంగా ఈ విషయం చెప్పారు. ఓ సీఎంగా ఉన్న వ్యక్తి తన కుమారుడిని బెంగుళూరు లాంటి చోట పెట్టాడు అంటే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఎలాంటి వాడో అర్థం చేసుకోండి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన కొడుకును ఎప్పుడూ ఏపీకి రానీయలేద బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారు. తెల్లవారితే సీఎంగా ఉన్న నాపై నింద వేసి తన పత్రికలో రాయించారు. తన చెల్లి సునీతను కూడా ఏమార్చారు. ఆ రోజే దోషులందరినీ అరెస్టు చేసి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇలా ఉండేదా. ఇప్పుడు తల్లిని, చెల్లినీ కూడా ఆస్తి కోసం మోసం చేస్తున్నారు. అలాంటి వ్యక్తులతో రాజకీయం చేయాల్సిన దుస్థితి వచ్చిందని చెప్పుకొచ్చారు.

## యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025-26లో ‘యూరియా బుకింగ్ యాప్’ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి ‘ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్’ను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు కూడా ఎరువుల బుకింగ్ చేసుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. యాప్ ద్వారా రైతులు సులభంగా ఎరువులు బుక్ చేసుకునేలా ‘మీ-సేవ’ బుకింగ్‌లను కూడా అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు లేదా స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తెస్తోందన్నారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, వ-రూరా సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రాబోయే పంట కాలాల్లో రైతుల సంఖ్య పెరిగినా, ఒకేసారి పెద్ద సంఖ్యలో రైతులు యాప్‌ను వినియోగించినా ఎలాంటి సాంకేతిక అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. యాప్ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు లోడ్ టెస్టింగ్ నిర్వహిస్తోందని, అవసరానికి అనుగుణంగా సర్వర్ సామర్థ్యాన్ని ఆటోమేటిక్‌గా పెంచుకునే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. గరిష్ట వినియోగ సమయంలో కూడా రైతులకు సేవలు అందేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అనంతరం పలువురు సభ్యులు యూరియా రైతులకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండటం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కౌలు రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో యాప్‌ను రద్దు చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, బ్లాక్‌మార్కెటింగ్‌ను అరికట్టడం, నిజమైన రైతులకు సబ్సిడీ ఎరువులు అందించడం కోసం తీసుకొచ్చిన ఈ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. యాప్ ద్వారా ఇప్పటికే 50 లక్షలకు పైగా రైతులు ఎరువులు కొనుగోలు చేశారని మంత్రి వెల్లడించారు. ఇంత పెద్ద సంఖ్యలో రైతులు ఈ వ్యవస్థను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి వ్యవస్థను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. యూరియా పంపిణీలో పారదర్శకత కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌ను ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువులను యాప్ ద్వారా విక్రయించే విధంగా ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో మొదట యూరియా పంపిణీ కోసం ప్రారంభించిన విధానాన్ని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విస్తరించి అన్ని సబ్సిడీ ఎరువులకు వర్తింపజేస్తోందన్నారు. రాష్ట్ర యాప్ స్థానంలో కేంద్రం రూపొందించిన యాప్‌ను గత వారమే రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేశామని తెలిపారు. గతంలో రైతులకు కేటాయించిన యూరియాను ‘ఇండస్ట్రియల్ యూరియా’ పేరుతో పరిశ్రమలకు తరలించిన సందర్భాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అలాగే అవసరానికి మించి కొంతమంది యూరియాను కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేసుకునే పరిస్థితులు కూడా ఉండేవని చెప్పారు. ఇలాంటి అక్రమాలు, దుర్వినియోగం, బ్లాక్‌మార్కెటింగ్ జరగకుండా చూడటంతో పాటు, ప్రభుత్వం అందించే సబ్సిడీ నేరుగా నిజమైన రైతుకు చేరాలనే ఉద్దేశంతో యాప్ విధానాన్ని తీసుకొచ్చామని మంత్రి స్పష్టం చేశారు. రైతులు యూరియాపై ఎక్కువగా ఆధారపడటానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వ ఎరువుల ధరల విధానమేనని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. యూరియాకు కేంద్ర ప్రభుత్వం అధిక సబ్సిడీ ఇస్తుండగా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల ధరలు రూ.2,000కు మించి ఉండటంతో రైతులు భూమి ఆరోగ్యాన్ని కాపాడే సమతుల్య ఎరువుల కంటే తక్కువ ధరకు లభించే యూరియా వైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధికంగా యూరియా వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, దీర్ఘకాలంలో పంటలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడే కాంప్లెక్స్ ఎరువులను సమతుల్యంగా వినియోగించే పరిస్థితి రావాలంటే ఎరువుల ధరలను కేంద్ర ప్రభుత్వం రేషనలైజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎరువుల ధరలను రేషనలైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని అనేకసార్లు కోరినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని మంత్రి తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం యూరియా కొరత లేదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పశ్చిమాసియాలో ఏర్పడిన యుద్ధ పరిస్థితుల కారణంగా యూరియా దిగుమతుల్లో కొన్ని అంతరాయాలు ఏర్పడి, అనుకున్న సమయానికి దేశానికి యూరియా చేరుకోని పరిస్థితులు గత సంవత్సరం, ఈ సంవత్సరం ఎదురయ్యాయని తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తూ, రాష్ట్రానికి అవసరమైన యూరియాను తెప్పిస్తుందని అన్నారు.

## ఏపీలో విద్యుత్ వాహనాలకు మరింత ప్రోత్సాహం

ఈ ప్రోత్సాహకం 2027 మార్చి వరకు వర్తిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకునే విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు కల్పించడం ద్వారా ప్రజలు ఈవీల వైపు మళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించేందుకు తొలి 5,000 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఖర్చులో 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈవీలకు పెరుగుతున్న ఆదరణ దేశంలో విద్యుత్ వాహనాల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆగస్టులో దేశవ్యాప్తంగా సుమారు 2.98 లక్షల విద్యుత్ వాహనాలు విక్రయించబడటం, గత ఏడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదవడం ఈ రంగానికి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమన్నారు. మొత్తం వాహన మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరగడం భవిష్యత్ రవాణా వ్యవస్థలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ ద్విచక్ర వాహనాలు, కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త విద్యుత్ కార్లను ప్రోత్సహించడంతో పాటు ప్రజా రవాణాలో ఈవీల వినియోగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి తీసుకురావడం, ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి చర్యలు రాష్ట్రంలో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై కేసు నమోదు

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారన్న ఘటనపై కేటీఆర్?, హరీశ్? రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులపై సైఫాబాద్ పోలీస్?స్టేషన్?లో కేసు నమోదైంది. సోమవారం అసెంబ్లీ గేట్ నంబర్ 03 వద్ద జరిగిన ఘటనపై మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో దీచీూ 74, 75(1), 79, 121(1), 130, 132, 296, 351(2), 352 తీ/ష 3(5) సెక్షన్ల కింద బీఆర్?ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దుర్భాషలాడి, బెదిరించారని ఫిర్యాదులో బాధిత పోలీసు? సిబ్బంది వెల్లడించారు. మహిళా పోలీసులను ఉద్దేశించి బీఆర్?ఎస్? నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా పోలీసులు అని చూడకుండా తమ ఎదుట టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వర్తించకుండా అడ్డుకుని బెదిరించినట్లు వివరించారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులు పరిశీలించాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రవర్తన దురుసుగా ఉందని తెలిపారు. మహిళా పోలీసులను నెట్టడంతో ఇబ్బంది కలిగించారని ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో తమకు తీవ్ర మానసిక వేదన, అవమానం కలిగిందని తెలిపారు. ఘటన అనంతరం మహిళా పోలీసులకు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేసినట్లు వివరించారు. కేటీఆర్, హరీశ్?రావు, సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డి సహా పలువురిపై కేసు నమోదైంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు కాంగ్రెస్ విఫలమైందంటూ నినాదాలున్న నల్ల టీషర్టులతో బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ బీఆర్?ఎస్ నేతలకు పోలీసులకు మధ్య తోపులాట చేసుకుంది. ఒక రకంగా యుద్ధ వాతావరణాన్ని తలపించింది. తమను ఎందుకు లోపలికి అనుమతించడం లేదని హరీశ్? రావు పోలీసులను ప్రశ్నించారు. దానికి బదులుగా టీషర్టులపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉన్నాయని, వాటికి అనుమతి లేదని స్పీకర్? ఆదేశాలిచ్చారని స్పందనగా పోలీసులు తెలిపారు. దీంతో ఆగ్రహావేశాలతో హరీశ్ రావుతో పాటు పులువురు నేతలు అక్కడే టీషర్టులు తీసేసి బనియన్లతో నిరసన తెలిపి లోపలికి పంపించాలని వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులకు బీఆర్?ఎస్? నేతలకు తీవ్రంగా తోపులాట జరిగి వివాదానికి దారి తీసింది. ఇక్కడే పోలీసులపై బీఆర్?ఎస్? నేతలు విరుచుకుపడ్డారు. దీంతో అక్కడే ఉన్న మహిళా పోలీసులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. దానికి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. దీనిపై తాజాగా కేసులు రిజిస్టర్ అయ్యాయి. మహిళా పోలీసులకు సంబంధించిన ఘటనపై మంత్రి సీతక్క విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న నేపథ్యంలో బీఆర్?ఎస్ నేతలపై కేసులు నమోదు అయ్యాయి.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు**

**సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు**

**సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం**

**సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్**

హైదారాబాద్ : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్?ఎస్? సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్? అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్?ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

## ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

**ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదు**

**కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ**

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

**రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు**

హైదారాబాద్ : తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్క, బీఆర్ఎస్ నేతల దాడిలో గాయపడిన మహిళా పోలీసు సిబ్బందిని పరామర్శించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను తమ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని ఆమె స్పష్టం చేశారు. కాగా, మంత్రి సీతక్క విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినవని, అవి ఏఐ-జనరేటెడ్ అని బీఆర్ఎస్ నేతలు కొట్టిపారేశారు.

## ఘనంగా కాళోజీ 112వ జయంతి వేడుకలు

హైదారాబాద్, సెప్టెంబర్ 09 : ఖైరతాబాద్‌లోని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ మరియు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తదితరులు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ అసిస్టెంట్ సెక్రెటరీ  ఎన్. సునీత, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీనారాయణ మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు గొప్ప కవి మరియు ప్రజా ప్రతినిధి అని, తెలంగాణ మాండలికాన్ని ఎగతాళి చేసిన వారికి తన శక్తివంతమైన, నిర్భయమైన కవితల ద్వారా తగిన సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆంధ్ర మహాసభ కార్యకలాపాలతో  ఆయన గ్రంధాలయోద్యమంలో చురుకుగా పనిచేశారని, అలాగే శాసనమండలి సభ్యునిగా కూడా సేవలందించారని గుర్తుచేశారు. ఆయన రాసిన "నా గొడవ" పుస్తకం ఎంతో ప్రజాదరణ పొందిందని, "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా  దేశానిది" అనే ఆయన ప్రసిద్ధ నినాదం నేటికీ ఎంతోమందికి స్ఫూర్తినిస్తోందని ఆయన అన్నారు.

### ఝార్ఖండ్ ఓటర్ల జాబితాలో ఆఫ్ఘనీయులు

జమ్‌షెడ్‌పూర్, సెప్టెంబర్ 09 : ఝార్ఖండ్‌లో నిర్వహించిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో తీవ్ర దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్ల ముసాయిదా జాబితాలో ఏకంగా ముగ్గురు ఆఫ్ఘనిస్థాన్ పౌరుల పేర్లు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ముసాయిదా ఓటర్ల జాబితా పరిశీలన, పత్రాల ధృవీకరణ సమయంలో అధికారులు ఈ వ్యత్యాసాన్ని కనిపెట్టారు.

## సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్

**తమిళనాడులో కొత్త కూటమికి సన్నాహాలు?**

**విజయ్? నాయకత్వంలో ఏర్పాటుకు సిద్ధం**

చెన్నై : తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## 'కాగ్నిజెంట్'కు భారీ ఎదురుదెబ్బ

**శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ నిలిపివేత**

**అమెరికా ఉద్యోగుల భద్రతకై నిర్ణయం**

**రెండు సంస్థలపై దర్యాప్తు ముమ్మరం**

న్యూఢిల్లీ : మోసాలపై ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్న వేళ ప్రముఖ ఐటీ సంస్థ 'కాగ్నిజెంట్'కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. గ్రీన్ కార్డు పొందడానికి తొలి మెట్టుగా భావించే శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ (పీఈఆర్ఎం) ఫైలింగ్స్‌ను అమెరికా ప్రభుత్వం నిలిపివేసింది. కాగ్నిజెంట్‌తో పాటు, క్లౌడెరా సంస్థల శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియను సస్పెండ్ చేసినట్లు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో ప్రకటించారు. అమెరికా ఉద్యోగులకు ముప్పు వాటిల్లితే సహించేది లేదని పేర్కొన్నారు. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్ ఫోర్స్, ఇతర ఉన్నతాధికారుల సమన్వయంతోనే ఈ రెండు సంస్థలపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. మరోవైపు ఈ వ్యవహారంపై అమెరికా కార్మిక శాఖ దర్యాప్తును వేగవంతం చేసింది. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్‌తో కలిసి వాస్తవాలు, మోసం, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలను లోతుగా పరిశీలిస్తున్నామని ఆంథోనీ డి'ఎస్పోసిటో తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "కాగ్నిజెంట్ పెర్మ్ ఫైలింగ్‌లను నిలిపివేశాం. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్‌తో కలిసి వాస్తవాలు, మోసం, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నాం. నేరస్థులకు సంకెళ్లు సిద్ధంగా ఉన్నాయ" అని డి'ఎస్పోసిటో పేర్కొన్నారు. కాగ్నిజెంట్, క్లౌడెరా సంస్థల పెర్మ్ ప్రక్రియను ఎందుకు నిలిపివేశారనే దానిపై దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కార్మిక శాఖ అధికారులు సంబంధిత రికార్డులు, ఫైలింగ్స్, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికాలో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాసం అంటే గ్రీన్‌కార్డు కోసం యాజమాన్యాలు అనుసరించే ముఖ్యమైన ప్రక్రియే ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్. విదేశీ ఉద్యోగిని శాశ్వతంగా నియమించుకునే ముందు ఆ ఉద్యోగానికి అర్హత కలిగిన అమెరికా కార్మికులు అందుబాటులో లేరని యాజమాన్యం నిరూపించాల్సి ఉంటుంది. అంతేకాకుండా విదేశీ ఉద్యోగిని నియమించడం వల్ల అమెరికా కార్మికుల వేతనాలు, ఉద్యోగ అవకాశాలు, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం ఉండదని కూడా నిర్ధరించాలి. ఈ ప్రక్రియను అమెరికా కార్మిక శాఖ పరిశీలించి అనుమతి ఇస్తుంది. ఆ తర్వాతే గ్రీన్‌కార్డు కోసం ఉద్యోగి తరఫున తదుపరి ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారత్‌కు చెందిన అనేక మంది ఐటీ నిపుణులు అమెరికాలోని టెక్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. వీరిలో కొందరు దీర్ఘకాలికంగా అమెరికాలో ఉండేందుకు గ్రీన్‌కార్డు కోసం ప్రయత్నిస్తుంటారు. ఇందుకోసం కంపెనీలు ఉద్యోగుల తరఫున ప్రక్రియను చేపడతాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాగ్నిజెంట్  ఫైలింగ్స్ నిలిపివేయడం సంస్థలోని విదేశీ ఉద్యోగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే గ్రీన్‌కార్డు ప్రక్రియలో ఉన్న ఉద్యోగులకు ఈ పరిణామం ఆందోళన కలిగించవచ్చు. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు సంస్థకు సంబంధించిన అన్ని  కేసులపై తుది ప్రభావం ఎలా ఉంటుందనే విషయం స్పష్టంగా తెలియాల్సి ఉంది. ట్రంప్ ప్రభుత్వం వీసా కార్యక్రమాల్లో అక్రమాలు, మోసాలపై మరింత కఠిన వైఖరి అవలంబిస్తోంది. జులైలోనే  ఉపాధి వీసా కార్యక్రమాలకు సంబంధించిన మోసం ఆరోపణలపై పెద్ద స్థాయి దర్యాప్తును ప్రారంభించినట్లు సమాచారం. అమెరికా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ యంత్రాంగం స్పష్టం చేస్తోంది. విదేశీ ఉద్యోగులను నియమించుకునే సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కాగ్నిజెంట్, క్లౌడెరాపై తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకుంది.

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు

**జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు సమావేశం**

**జీఎస్డీపీ, సూపర్ 6, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్‌పై మొదటిరోజు చర్చ**

**2వ రోజు ఇ-గవర్నెన్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌తో పాటు పలు అంశాలపై సమీక్ష**

అమరావతి, సెప్టెంబర్ 09  : 10, 11వ తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి కీలక విభాగాల వారీగా సమీక్షించనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు. రెండు రోజులు... 19 అంశాలుమొదటి రోజున జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సమీక్షిస్తారు. అదే విధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యా రంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రదర్శిస్తారు. ఇక రెండో రోజు సదస్సులో ఇ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీ ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షించి... అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

**ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్**

**తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన**

**మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి**

**అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 : తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి"తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి  ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.  తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలు, విస్తారమైన ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతతో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించగలవని ఆయన పేర్కొన్నారు.  "తెలంగాణ రైతు పండించిన ధాన్యానికి అంతర్జాతీయ మార్కెట్ ద్వారాలు తెరవడమే మా ప్రభుత్వ లక్ష్యం. బియ్యం ఎగుమతులు విస్తరించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతోపాటు రైస్‌మిల్లర్లు, విత్తన కంపెనీలు, మాంస ఉత్పత్తిదారులు, ఆహారశుద్ధి పరిశ్రమలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగా కాకుండా ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానమైన లాభసాటి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలకు అంతర్జాతీయ వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం, ఆహారశుద్ధి, విత్తనోత్పత్తి, ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల రంగాల్లో తెలంగాణ--ఫిలిప్పీన్స్ మధ్య నూతన భాగస్వామ్యానికి ఈ సమ్మిట్ బలమైన పునాది వేస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు

**ఇరాన్ చమురు ట్యాంకర్లపై దాడులు**

**దాడులకు ప్రతిదాడులు చేసిన ఇరాన్**

**అమెరికా అండర్ వాటర్ డ్రోన్ సీజ్**

ఒమన్ గల్ఫ్ : అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు చెందిన ఐదు ముడి చమురు రవాణా నౌకలపై అమెరికా బలగాలు దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంటకామ్) వెల్లడించింది. మంగళవారం చేపట్టిన ఈ దాడుల్లో నాలుగు నౌకలు పూర్తిగా ధ్వంసమైనట్లు, మరో నౌక దెబ్బతిన్నట్లు తెలిపింది. అమెరికా యుద్ధనౌకపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) 48 గంటల్లో రెండుసార్లు బాలిస్టిక్ క్షిపణులతో దాడికి ప్రయత్నించడంతో ప్రతీకార చర్యగా ఈ దాడులు చేపట్టినట్లు సెంట్కామ్ పేర్కొంది. సెంటకామ్ ప్రకటన ప్రకారం, ఒమన్ గల్ఫ్‌లో ఇరాన్‌కు చెందిన నాలుగు ముడి చమురు రవాణా నౌకలు దాడుల్లో ధ్వంసమయ్యాయి.  డెర్యా ఖార్గ్ ద్వీపం సమీపంలో దెబ్బతిన్నట్లు అమెరికా సైనిక కమాండ్ తెలిపింది. దాడికి సంబంధించిన దృశ్యాలను కూడా విడుదల చేసింది. ఈ దాడులకు ముందు ఐదు నౌకల్లోని సిబ్బందిని ఖాళీ చేయాలని అమెరికా బలగాలు ప్రత్యక్ష ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. మానవ ప్రాణనష్టాన్ని నివారించేందుకు ముందస్తు హెచ్చరికలు ఇచ్చినట్లు పేర్కొంది. ఇరాన్ ప్రభుత్వ అనుబంధ నౌకాదళానికి చెందిన ఈ నౌకలు, టెహ్రాన్ భద్రతా వ్యవస్థకు ఆర్థికంగా కీలకమైనవని అమెరికా పేర్కొంది. గత 48 గంటల్లో ఇరాన్? ఒక అమెరికా నావికాదళ యుద్ధనౌకను రెండుసార్లు బాలిస్టిక్ క్షిపణులతో లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నించిందని యుఎస్? సెంట్రల్? కమాండ్ తెలిపింది. అయితే ఆ రెండు దాడులను అమెరికా యుద్ధనౌక విజయవంతంగా తప్పించుకున్నట్లు వెల్లడించింది. ఈ ఘటనలో అమెరికా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని, యుద్ధనౌక కార్యకలాపాలకు కూడా ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడించింది. దాడి ప్రయత్నాల తర్వాత కూడా ఆ యుద్ధనౌక ప్రాంతీయ జలాల్లో గస్తీ కొనసాగిస్తోందని పేర్కొంది. సెప్టెంబర్ 5న కూడా ఐఆర్?జీసీ అమెరికా విమాన వాహక నౌక, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్‌పై దాడికి ప్రయత్నించిందని సెంట్కామ్ తెలిపింది. ఆ దాడి ప్రయత్నం విఫలమైన తర్వాత మూడు ఇరాన్ ముడి చమురు రవాణా నౌకలను అమెరికా బలగాలు ధ్వంసం చేశాయని పేర్కొంది. తాజాగా మరో ఐదు నౌకలపై చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. దాడులకు గురైన నౌకలు సాధారణ వాణిజ్య రవాణా వ్యవస్థలో భాగం కాదని అమెరికా సైనిక కమాండ్ ఆరోపించింది. ఇవి ఐఆర్జీసీ, దాని ప్రాంతీయ మిత్ర బలగాలకు నిధులు సమకూర్చే బహుళ బిలియన్ డాలర్ల రహస్య నెట్‌వర్క్‌లో భాగమని పేర్కొంది. ఇరాన్ తన భద్రతా వ్యవస్థను కొనసాగించేందుకు చమురు ఆదాయంపై ఆధారపడుతోందని అమెరికా చెబుతోంది. ఈ నేపథ్యంలో చమురు రవాణా వ్యవస్థను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచే ప్రయత్నంగా తాజా దాడులను పరిశీలిస్తున్నారు. మరోవైపు అమెరికా దాడులకు ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడులకు ప్రతీకారంగా ఐఆర్?జీసీ సైనిక చర్యలు చేపట్టినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. జోర్డాన్‌లోని అమెరికా ఆధీనంలోని అల్ అజ్రాక్ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. అమెరికా నావికాదళానికి చెందిన రెండు డిస్ట్రాయర్లను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ పేర్కొంది. ఈ దాడుల్లో ద్రవ, ఘన ఇంధన బాలిస్టిక్ క్షిపణులను ఉపయోగించారని ఆఆర్?జిసి ధ్రువీకరించింది. అమెరికా యుద్ధ విమానాలకు సంబంధించిన హ్యాంగర్లు, రక్షణ షెల్టర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించింది. అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మరో కీలక హెచ్చరిక చేసింది. కువైట్, బహ్రెయిన్ ఓడరేవుల సమీపంలోని చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. పోర్టుల్లో నౌకలు లంగరు వేసి ఉన్నప్పటికీ వాటిపై దాడులు జరిగే అవకాశం ఉందని తెలిపింది. నౌకల్లో పనిచేస్తున్న సిబ్బంది వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించింది. అమెరికా బలగాలకు కువైట్, బహ్రెయిన్‌లు ఆశ్రయం కల్పిస్తున్నాయని, తమపై జరిగే దాడులకు సహకరిస్తున్నాయని ఇరాన్ ఆరోపించింది. ఈ హెచ్చరికలతో గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు మరింత పెరిగాయి. ముఖ్యంగా చమురు రవాణాకు కీలకమైన సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతలు పెరిగితే అంతర్జాతీయ ఇంధన సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిలో అమెరికాకు చెందిన అండర్‌వాటర్ డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇరాన్ తెలిపింది.

# సంపాదకీయం

## యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు!!

రష్యా- ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఏ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ యూరోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు. విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తుందని ఆయన చెప్పారు. 'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దృష్టిలో, ఇది వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దృష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్ మరియు పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'యూరోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు మరియు మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు. ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న ఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ – పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపుకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భారత నాయకత్వానికి ప్రశ్నార్థకంగా బ్రిక్స్ సదస్సు

భారత్ అధ్యక్షతన సెప్టెంబర్ 12-13 తేదీలలో న్యూఢిల్లీలో జరుగనున్న ప్రతిష్టాత్మక 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయ వ్యవహారాలలో భారత్ నాయకత్వంకు ప్రశ్నార్థకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటగా, పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల దృష్ట్యా ఉమ్మడి ప్రకటన సాధ్యమా? అనే ప్రశ్న తలెత్తుతుంది. బ్రిక్స్ సభ్యత్వం ఆశిస్తున్న బంగ్లాదేశ్ ప్రతినిధిగా ఆ దేశ ప్రధాని తారిక్ రెహమాన్ హాజరవుతారా? అన్నది సందేహాస్పదంగా ఉంది. పైగా, బ్రిక్స్ ఏర్పాటై 20 ఏళ్లు పూర్తవుతున్నందున, ఈ సంవత్సరం ఒక ముఖ్యమైన మైలురాయిగా కూడా నిలుస్తుంది. అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య జరిగిన గత బ్రిక్స్ సమావేశంలో బ్రెజిల్ అధ్యక్షుడు ఉమ్మడి ప్రకటన చేయించగలిగారు. తాజాగా బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సులో సైతం ఉమ్మడి ప్రకటన వెలువడింది. ఇరాన్ బ్రిక్స్ సభ్యదేశమైనప్పటికీ ఆ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సమయంలో భారత్ బ్రిక్స్ అధ్యక్ష హోదాలో స్పష్టంగా ఖండించకపోవడం, యుద్ధం ఆపేందుకు క్రియాశీల పాత్ర వహించకపోవడం సహజంగానే అంతర్జాతీయ వ్యవహారాలలో భారత్ పాత్రపట్ల సందేహాలను రేకెత్తిస్తున్నది. ఉగ్రవాదానికి అడ్డాగా పేరొందిన పాకిస్థాన్ అమెరికా-ఇరాన్‌ల మధ్య సయోధ్య కోసం ప్రయాణించగలగడం ఓ విధంగా భారత్‌కు తలవంపు కలిగించే విషయమే. ఐరోపా, పశ్చిమ ఆసియాలలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ముగిసే సూచనలు కనిపించనప్పటికీ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పావు వంతుకు పైగా, దాని జనాభాలో దాదాపు సగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ పదకొండు దేశాల శిఖరాగ్ర సమావేశానికి చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఇతర ప్రపంచ నాయకులు హాజరుకానున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆతిథ్యం ఇస్తున్న ఈ రెండు రోజుల శిఖరాగ్ర సమావేశం నిర్దుష్టమైన, ఫలవంతమైన చర్చలకు వేదిక కాగలదా? అన్నదే ప్రశ్న. ఎస్‌సిఒ సదస్సు ఉమ్మడి ప్రకటనలో నేరుగా అమెరికా, ఇజ్రాయెల్ లను ఖండించకుండా ప్రధాని మోడీ చేయగలిగారని స్వదేశంలో సోషల్ మీడియా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ ఇరాన్‌పై దాడి ప్రారంభమైనప్పుడు దానిని ఖండిస్తూ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇచ్చిన ప్రకటననే ఇప్పుడు కూడా దాదాపుగా ఉమ్మడి ప్రకటనలో చేర్చారని గుర్తించాలి. చైనా అధినేతకు ఎప్పుడూ విదేశీ నేతలను నేరుగా ప్రస్తావించకుండా తనదైన శైలిలో తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పడం అలవాటు. మొండి బాకీల భారం ఎవరిపై? బ్రిక్స్ కూటమిలోని సభ్యదేశాలైన సౌదీ అరేబియా, యుఎఇలు, అదే కూటమిలో సభ్యదేశమైన ఇరాన్‌తో అమెరికా జరుపుతున్న యుద్ధంలో అమెరికాకు మద్దతుగా నిలుస్తున్నందున, ఈ శిఖరాగ్ర సమావేశంలోని చర్చలను ప్రపంచంలోని ప్రధాన రాజధానులన్నీ నిశితంగా గమనిస్తాయి. ఈ దేశాల మధ్య ఉన్న విభేదాల కారణంగా, మే నెలలో న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం పశ్చిమ ఆసియా వివాదంపై ఉమ్మడి ప్రకటనను వెలువరించడంలో విఫలమైంది. ప్రధానంగా డాలర్ వినియోగాన్ని తగ్గించే ప్రయత్నాలు, ప్రపంచ స్థాయిలో అమెరికన్ డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేసే ఆర్థిక విధానాల కారణంగా, అమెరికా, ముఖ్యంగా దాని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రిక్స్‌పై తన విమర్శలను తీవ్రతరం చేసిన సమయంలో ఈ శిఖరాగ్ర సమావేశం జరుగుతోంది. చైనా, రష్యా, ఇరాన్ వంటి రాజకీయ ప్రత్యర్థులు ఈ కూటమిలో ఉండటం వల్ల, బ్రిక్స్ తన ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కూటమిగా అమెరికా భావిస్తోంది. బ్రిక్స్‌ను బలోపేతం కావించడం అంటే అమెరికాను బలహీనం కావించే చర్యగా ఆయన భావిస్తున్నారు. అందుకనే బ్రిక్స్ కరెన్సీ ప్రతిపాదనను రష్యా తెరపైకి తీసుకొచ్చినప్పుడు అమెరికా డాలర్‌ను నిర్వీర్యం చేసే ఎత్తుగడగా భావిస్తూ ఆగ్రవేశాలు వ్యక్తం చేశాయి. ఇటువంటి కీలకమైన అంశాలలో అమెరికాకు ఆగ్రహం కలిగించకుండా, రష్యా ప్రతిపాదనను తోసిపుచ్చలేక భారత్ డిజిటల్ కరెన్సీ ప్రతిపాదనను తెరపైకి తీసుకురావడం గమనార్హం. బ్రిక్స్ అధ్యక్ష హోదాలో నిర్దిష్టంగా అంతర్జాతీయ వ్యవహారాలలో భారత్ తన క్రియాశీలతను ప్రదర్శించలేకపోయినప్పటికీ స్వదేశంలో ఎంతో హడావుడి చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది భారత్ అధ్యక్షతన, రాజకీయ – భద్రత, ఆర్థిక ఆర్థిక వ్యవహారాలు, సాంస్కృతిక –ప్రజల మధ్య సంబంధాలు అనే మూడు కీలక స్తంభాల ఆధారంగా బ్రిక్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి దేశవ్యాప్తంగా 25 నగరాల్లో 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. కాగా, బిమ్స్టెక్ కూటమికి ప్రస్తుత అధ్యక్ష హోదాలో, బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి తారిక్ రెహమాన్‌ను కూడా శిఖరాగ్ర సమావేశంలోని అవుట్‌రీచ్ సెషన్‌లకు ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. రిటైర్మెంట్ కన్నా జడ్జీల అనుభవమే మిన్న ఆయన తొలుత ఈ సదస్సుకు హాజరుకావాలని ఆసక్తిని కనబరచారు కూడా. ఈ విషయమై బంగ్లాదేశ్ లోని భారత హైకమిషనర్ దినేష్ త్రివేది ఆయనను కలిసి అందుకు అవసరమైన పూర్వరంగాన్ని సిద్ధం చేశారు. పొరుగు దేశాల మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించడానికి త్రివేది చేసిన ప్రయత్నాలు, చివరికి భారత పర్యటన తేదీలకు బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహమాన్‌ను ఒప్పించడం వంటివి మన విదేశాంగశాఖలోని కీలక వ్యక్తులలో అసూయ చెలరేగిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అందుకనే, రెహమాన్ భారత్ పర్యటన తేదీలు బయటకు పొక్కగానే అకస్మాత్తుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేయించారని చెబుతున్నారు. భారత్– బంగ్లాదేశ్ సంబంధాలలో సయోధ్యను తీసుకువచ్చే ప్రయత్నాలను అడ్డుకోవడంలో విదేశాంగ మంత్రిత్వ శాఖలోని ఒక శక్తివంతమైన లాబీ పాత్ర పోషిస్తోందని ఢిల్లీ, బంగ్లాదేశ్‌లలోని దౌత్యవర్గాల వారు భావిస్తున్నారు. ఐఎఫ్ఎస్ అధికారి కాని, రాజకీయ నాయకుడైన మాజీ కేంద్ర మంత్రి దినేష్ త్రివేదిని బంగ్లాదేశ్‌కు భారత హైకమిషనర్‌గా ప్రధాన మోడీ నియమించడంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ బహుశా అసంతృప్తిగా ఉంది. ఈ ఏడాది ఆరంభంలో భారత రాయబారులతో జరిగిన ఒక సమావేశంలో, మన పొరుగు దేశాలలో మరిన్ని ఐఎఫ్ఎస్-యేతర రాయబారి నియామకాల గురించి మోడీ సూచనప్రాయంగా తెలిపారు. ఈ ప్రక్రియకు విఘాతం కలిగించేందుకు సంప్రదాయ విదేశాంగ విధాన నియమాలను పక్కనపెట్టి, ఢిల్లీలోని ఫారిన్ కరస్పాండెంట్స్ క్లబ్‌లో షేక్ హసీనా వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడానికి అది అనుమతి ఇచ్చినట్లు పలువురు భావిస్తున్నారు.

## నవ్యాంధ్ర పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి ప్రాచుర్యం

**నవ్యాంధ్రలో తొలిసారిగా 41వ 'ఐఏటీఓ' జాతీయ సదస్సు"**

**ఇండియా - ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" థీమ్‌తో సదస్సు నిర్వహణ**

విశాఖపట్నం, సెప్టెంబర్ 9 : ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతాయుతమైన, పర్యావరణహిత పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో రాష్ట్రంలో పర్యాటక విప్లవం ఆవిష్కృతమవుతోందని ఆయన స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఈ నెల 10 నుండి 12 వరకు విశాఖ వేదికగా జరగనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సదస్సు వివరాలను మంత్రి దుర్గేష్ మీడియాకు వెల్లడించారు. సెప్టెంబర్ 13న ఐఏటీఓ సభ్యుల కోసం ఏపీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో 6 ప్రత్యేక 'పోస్ట్ కన్వెన్షన్' టూర్లు ఏర్పాటు చేశామన్నారు. నవ్యాంధ్రలో తొలిసారిగా ప్రతిష్టాత్మక 'ఐఏటీఓ' జాతీయ సదస్సు..గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా ఏపీఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. భారతదేశంలో ఇన్-బౌండ్ టూరిజం అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రతిష్టాత్మక 41వ జాతీయ సదస్సును ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తోందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. "ఇండియా – ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" అనే ముఖ్య థీమ్ తో జరుగుతున్న ఈ సదస్సులో దేశవ్యాప్తంగా 1,000 మందికి పైగా పర్యాటక రంగ ప్రతినిధులు, ప్రముఖ టూర్ ఆపరేటర్లు, విధాన నిర్ణేతలు మరియు పారిశ్రామికవేత్తలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2,068 కంటే ఎక్కువ మంది ప్రతినిధులతో ఇన్-బౌండ్ టూరిజంలో అగ్రగామిగా ఉన్న ఐఏటీఓ ) జాతీయ సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి జరిగిన ఈ సదస్సు, నవ్యాంధ్రప్రదేశ్ ఆవిర్భావం తర్వాత జరగడం ఇదే తొలిసారి అని తెలిపారు. ఈ వేదిక ఏపీ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి దోహదపడుతుందన్నారు. రేపు (గురువారం) సాయంత్రం జరిగే ఐఏటీఓ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అదే విధంగా కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి భువనేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు మరియు పర్యాటక రంగ ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ 1000కి.మీలకు పైబడిన సుదీర్ఘ సముద్ర తీరం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం, అరకు లోయ, గిరిజన సంస్కృతి, బౌద్ధ క్షేత్రాలు మరియు సహజ సౌందర్యాన్ని అంతర్జాతీయ పర్యాటక పటంలో నిలపడానికి వేదిక సుగమమైందన్నారు.

## పోషణ్ మహ్ -2026 గోడప్రతులను ఆవిష్కరించిన కలెక్టరు కె.వెట్రిసెల్వి

ఏలూరు, సెప్టెంబరు 09 : కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో జిల్లా మహిళా అభివృద్ధి. శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ -2026 గోడప్రతులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషక ఆహారంపై అవగాహన పెంపొందించడమే పోషణ్ మహ్-2026 ప్రధాన లక్ష్యమని అన్నారు. సమతుల్య ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, తల్లిపాలు, చిన్నారులు ఆరోగ్యసంరక్షణ వంటి అంశాలుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా పోషకాహార కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన వైద్య, పోషక సహాయం అందించాలని అన్నారు. పోషణ్ మహ్-2026 సందర్భంగా జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చెయ్యాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు.

## నేర్పరితనం ఉంటేనే రాణింపు!

తిరుమల : జీవితంలో నేర్పరితనం అవసరం. నేర్పు లేకుంటే మనుగడ సాగించడం కష్టం. ఔషధ సేవనంతో రోగవిముక్తి పొందవచ్చు. కాని, శత్రు విముక్తికి ఎలాంటి ఉపాయమూ లేదు.'అపకారికి ఉపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి' అన్నాడు సుమతీ శతకకారుడు. అంతటితో శత్రుత్వ నశిస్తుందనలేదు. నేర్పుగా ఎలా జీవించాలో చెప్పాడంతే. నేర్పు అంటే దుష్పరిణామాల నుంచి ఉపాయంగా తప్పించుకోవడం. పాము పడగవిప్పి కాటు వెయ్యాలని మీదకు దూకుతుంటే పాములు పట్టేవాడు ఎలా తప్పించు కుంటాడు? చివరకు పాము తలను దొరకబుచ్చుకుంటాడు... అదీ నేర్పు అంటే ఇలాంటి నేర్పు పొందాల్సిన అవసరం కల్పించే వాడే శత్రువు. మనకు కలిసివచ్చే కాలంలో సిరిసంపదలు, పేరు ప్రఖ్యాతులు వస్తే అకారణ శత్రువులు ఏర్పడతారు. డబ్బుతో పాటే మనలను వ్యతిరేకించే వారు పెరుగుతారు. అసూయాపరులు మనవైపే చూస్తుంటారు. వీరు ఎంత లౌక్యులంటే వారి చూపుల్లో గాని, ప్రవర్తనలోగానీ ఎక్కడా వారి క్షుద్రభావాలు వెల్లడి కావు. పంచదార పలుకులతో మనల్ని ప్రలోభ పెడతారు. పైకి మిత్రులు, ఆత్మీయులు. లోపల అసూయ లావా కుతకుతలాడుతున్న అగ్నిపర్వతాలు. అవకాశం లభిస్తే మొదటి అపకారం వీళ్లే చేస్తారు. చాటున మన గురించి తీవ్రమైన దుష్ప్రచారం చేస్తారు. మనల్ని ఏకాకుల్ని చేయడానికి మిత్ర, బంధువర్గాల్లో మనకున్న మంచి పేరు చెడగొట్టడానికి శతథా యత్నిస్తారు. సోమరిపోతు, నిద్రాప్రియుడు కూడా ఇంట్లోకి పాము ప్రవేశించిందనగానే అప్రమత్తమై వేయికళ్లతో పాము జాడల కోసం వెతుకు తాడు. కనిపించగానే వెర్రి ఆవేశంతో కర్రదెబ్బలు కొడతాడు. ఇక్కడ పామే శత్రువు. దాన్ని చంపకపోతే అది మనల్ని చంపేస్తుంది. అలాగని దానికి నేర్పరితనం కూడా అవసరమే. ఇది ఒంటబట్టిన వారు జీవితంలో నెగ్గుకు రాగలరు.



ఆధ్యాత్మికం

# ప్రజల పక్షాన నిలిచిన కాళోజీ గొంతుక ఎప్పటికీ స్ఫూర్తిదాయకం

**● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ● ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు**

**గోదావరిఖని క్రైమ్ :** ప్రజల పక్షాన నిలిచిన కాళోజీ గొంతుక ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ యాస, భాషలో సామాజిక అంశాలను తన రచనల ద్వారా ప్రజలకు చేరువ చేసి, వారిలో చైతన్యం కలిగించిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. కాళోజీ కేవలం కవి మాత్రమే కాకుండా, సామాన్య ప్రజల సమస్యలను తన రచనల ద్వారా బలంగా వినిపించిన ప్రజా గొంతుకగా నిలిచారని తెలిపారు. సామాన్యుడి భాషలో సామాన్యుడి జీవితాన్ని, సమస్యలను ప్రతిబింబిస్తూ సామాజిక అన్యాయం, అసమానతలు, దోపిడీ, నిరంకుశత్వాన్ని ప్రశ్నించే చైతన్యాన్ని కాళోజీ తన రచనల ద్వారా కలిగించారని పేర్కొన్నారు. నా గొడవ వంటి రచనలు ఆయన ప్రజా చైతన్యానికి ప్రతీకలుగా నిలిచాయని తెలిపారు. ప్రజా సేవ, సాహిత్యం, సామాజిక చైతన్యానికి కాళోజీ చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సమస్యలను ఓపికగా వినడం, బాధితులకు న్యాయం చేయడం, బలహీన వర్గాలకు అండగా నిలవడం, విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రజల కోసం ప్రశ్నించిన కాళోజీ కలం మనకు స్ఫూర్తి అయితే, ప్రజల భద్రత కోసం పనిచేసే మన యూనిఫామ్

ప్రజలకు నమ్మకానికి ప్రతీకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు మరింత చేరువగా, బాధ్యతాయుతంగా, మానవీయ దృక్పథంతో పోలీసింగ్ అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏవో శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు భీమేశ్, శ్రీనివాస్, ఆర్ఐలు శేఖర్, రమేష్, సీసీ సందీప్, ఆర్ఎస్ఐలు ప్రవీణ్, శివ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

# కలెక్టర్ గారు అక్రమ మైనింగ్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

**● పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు ● ఫిర్యాదు చేసిన రిసీవ్డ్ కాపీలతో త్వరలోనే సి ఎస్‌ను కలుస్తా**

**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలో అక్రమంగా జరుగుతున్న మట్టి, మొరం తవ్వకాలు, రవాణాపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేసిన రిసీవ్డ్ కాపీలతో త్వరలోనే రాష్ట్ర సిఎస్ కలుస్తానని శాంతి నగర్ రెండో వార్డుకు చెందిన సానికొమ్ము రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ మైనింగ్, మట్టి రవాణాను అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంరెడ్డి మాట్లాడుతూ.. గత నెల రోజులుగా పెద్దపల్లి పరిసర ప్రాంతాల్లో అక్రమ మట్టి, మొరం తవ్వకాలు, రవాణా జరుగుతున్న విషయాన్ని రెవెన్యూ, మైనింగ్, రవాణా, పోలీసు శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు సమర్పించడంతో పాటు, వాటికి సంబంధించిన రశీదులను వాట్సాప్ ద్వారా పంపించినా ఇప్పటివరకు తగిన స్పందన లేదని తెలిపారు. పెద్దపల్లి పరిధిలో రోజుకు సుమారు 100 నుంచి 150 ట్రిప్పుల వరకు అక్రమ మట్టి రవాణా జరుగుతోందని రాంరెడ్డి ఆరోపించారు. భోంపల్లి, కన్నాల, మద్దికుంట ప్రాంతాల్లో తెల్లవారుజామున నుంచే మట్టి వాహనాల రాకపోకలు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు, రవాణా జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. మైనింగ్ అధికారులను సంప్రదిస్తే పోలీసులను ఆశ్రయించాలని, పోలీసులను సంప్రదిస్తే అది తమ పరిధిలోని అంశం కాదన్నట్లుగా సమాధానం ఇస్తున్నారని ఆయన వాపోయారు. మట్టి వాహనాలు తమ కళ్ల ముందే వెళ్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా పాలకుర్తి తహసీల్దార్‌కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసి, బండ్లగూడ రహదారితో పాటు బొంపల్లి మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి, కటికెనపల్లి తదితర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్, మట్టి రవాణాపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని రాంరెడ్డి కోరారు. భోంపల్లి, కన్నాల గ్రామాల్లో జరుగుతున్న అక్రమ మొరం తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వారాంతాలు, రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, అనుమతులు లేకుండా మైనింగ్ లేదా ఖనిజాల రవాణాకు పాల్పడుతున్నట్లు తేలితే టిప్పర్లు, యంత్రాలు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ మట్టి రవాణా వెనుక రాజకీయ నాయకులు, వారి పీఏల పలుకుబడి ఉందని రాంరెడ్డి ఆరోపించారు. ఈ కారణంగానే అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను అధికారులకు అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని

తెలిపారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసు, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేస్తే అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని రాంరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి ఆయా శాఖల అధికారులతో ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని కోరారు. అక్రమ మట్టి, మొరం తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఆదాయానికి జరుగుతున్న నష్టాన్ని అరికట్టడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై హద్దుమీరి మాట్లాడితే ఖబర్దార్: గట్టెపల్లి దీపక్

**తిమ్మాపూర్, సెప్టెంబర్9:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్లునూరుకు చెందిన బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు గట్టెపల్లి దీపక్ మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ చావును కోరుతున్నట్లు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటనను విడుదల చేశారు. తెలంగాణ సాధనకై బిఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుల త్యాగాలను, పోరాట స్ఫూర్తిని మర్చిపోవద్దంటూ ఎమ్మెల్యే శంకర్‌కు సూచించారు. తెలంగాణ ఎవరి దయవల్ల రాలేదని,ఎన్నో ఏళ్ల ఉద్యమ స్ఫూర్తితో ప్రజల పోరాటం, ఉద్యమకారుల త్యాగంతోనే తెలంగాణను సాధించుకున్నామన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను చుట్టుముట్టి, ఆయనపై అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం గట్టిగానే ఉంటుందన్నారు. వ్యక్తిగత ద్వేషాలు లేకుండా సంస్కారవంతమైన రాజకీయాలతో ప్రజాసమస్యలపై ప్రతిపక్షాల ప్రశ్నలకు ప్రభుత్వ సుపరిపాలన విధానాలతో సమాధానం చెప్పాలని హితువుపలికారు. ఇంకా సజీవంగా ఉన్న తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని,ప్రజల ఆత్మగౌరవాన్ని ఎవరూ తక్కువగా అంచనా వేయలేరని,బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై హద్దు మీరి మాట్లాడితే ఖబర్దార్ అంటూ ఎమ్మెల్యే శంకరర్ ను గట్టెపల్లి దీపక్ ప్రకటన ద్వారా హెచ్చరించారు.

## సమస్యలపై ప్రజల దృష్టిని మళ్ళించేందుకు కాంగ్రెస్ నీచ రాజకీయాలు: కనగండ్ల తిరుపతి

**బెజ్జంకి, సెప్టెంబర్9:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కనగండ్ల తిరుపతి మాట్లాడుతూ....బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ని కులం పేరుతో గానీ, మరే విధంగానైనా అవమానిస్తూ మాట్లాడలేదని, అభివృద్ధి చేయడం చేతగాక సమస్యలపై ప్రజల దృష్టిని మళ్ళించేందుకు అసెంబ్లీ గేట్ ముందు హరీష్ రావు, కేటీఆర్, మహిళా ఎమ్మెల్యేల పట్ల కించపరిచే విధంగా వ్యవహరించి కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడిందని ఆరోపిస్తూ దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇక ఎమ్మెల్యే కవ్వంపల్లి కేవలం ఒక నిర్దిష్ట సామాజిక వర్గం వాళ్ళనే కేసిఆర్ ఫాంహౌస్ కు డప్పులతో రావాలని పిలవడం వెనుక ఆంతర్యమేంటో ప్రజలకు వివరించాలన్నారు. అన్ని దళిత వర్గాలను సమానంగా గౌరవించాల్సిన బాధ్యత దళితుడిగా స్పీకర్ కు ఉండగా కేవలం మాదిగ సామాజిక వర్గాన్నే ప్రత్యేకంగా పిలిచి స్పీకర్ అవమానించాడన్న అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు. తమకు పూర్తి స్థాయిలో పారితోషికం అందడం లేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేవలం డబ్బులు తీసుకునే డప్పు కళాకారులుగా చూడడం మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యేనన్నారు. ఎరవెల్లి ఘటనపై కాంగ్రెస్ వ్యవహరించిన తీరును ప్రజలు గమనించారని,ఇకపై బీఆర్ఎస్ శ్రేణులపై కించపరిచేలా వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగా, రాజకీయపరంగా అదే స్థాయిలో గట్టిగా సమాధానం ఇస్తామని హెచ్చరిస్తూ నీచ రాజకీయాలకు స్వస్తి పలికి, తెలంగాణ అభివృద్ధికి ప్రజాసంక్షేమంపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచ్లు బొల్లం శ్రీధర్, ఎరవెల్లి శ్రీనివాస్, ఎల శేఖర్ బాబు, పట్టణాధ్యక్షుడు వంగల నరేశ్, మహేష్, శ్రీనివాస్, ఘనపురం తిరుపతి, అమరగొండ రాజు, బొడిగే అనిల్,గాజె రాజు,కనగండ్ల శంకర్,రామంచ పర్శరాములు, అజయ్, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్న డా. చిరుమిల్ల అర్చనరాకేష్

**పెద్దపల్లి ప్రతినిధి :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 85వ కాన్వొకేషన్ వేడుకల్లో న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన డా. చిరుమిల్ల అర్చనరాకేష్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. "సెటిల్మెంట్ అఫ్ ల్యాండ్ డిస్పుట్స్ ఇన్ ఏడిఆర్ మెథడ్స్ " అనే అంశంపై పరిశోధన చేసిన ఆమెకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగారం, భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డా. కృష్ణ ఎల్లా చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ సభ్యులు ప్రొఫెసర్ బాణాపురం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డా. చిరుమిల్ల అర్చన గతంలో హైకోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా సేవలందించారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఆమె తెలంగాణ తొలి టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ సతీమణి. న్యాయశాస్త్రంలో విశిష్ట పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్న డా. చిరుమిల్ల అర్చనకు పలువురు న్యాయవాదులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి

**అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

**పెద్దపల్లి ప్రతినిధి :** ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారికంగా నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందించే వ్యక్తిత్వం కాళోజీది అన్నారు. సత్యాగ్రహ మహోద్యమంలో పాల్గొని పిన్న వయసులోనే జైలు జీవితం గడిపారని తెలిపారు. విద్యార్థి దశ నుండే నిజాం ప్రభుత్వం నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకులు కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని, ప్రజాకవి కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల మనోభావాలను కించపరిచే చర్యలను సహించం

**కేసీఆర్ ఫార్మ్‌హౌస్ వద్ద 'శుద్ధి' కార్యక్రమాలపై ఆగ్రహం**

**డిసిసి ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి కనకం విద్యాసాగర్ డిమాండ్**

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్9:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫార్మ్‌హౌస్ సమీపంలో దళిత కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'దప్పుల దండోరా' కార్యక్రమం విజయవంతం కావడం పట్ల దళిత కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు దళిత కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కనకం విద్యాసాగర్ మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని నిరసిస్తూ దప్పుల దండోరా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అయితే దళితులు కార్యక్రమం నిర్వహించిన ప్రదేశంలో కొంతమంది బీఆర్ఎస్ నాయకులు పాలు, పసుపుతో 'శుద్ధి' కార్యక్రమం నిర్వహించినట్లు వచ్చిన వార్తలు, దృశ్యాలు తీవ్రంగా కలచివేశాయని ఆయన అన్నారు. దళితుల మనోభావాలను తీవ్రంగా కించపరిచే విధంగా టిఆర్ఎస్ నాయకులు కార్యక్రమం చేపట్టారు. "దళితులు ఒక ప్రాంతానికి వస్తే ఆ ప్రాంతాన్ని శుద్ధి చేయడం అంటే ఏమిటి? ఇది అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్య కాదా? మానవ సమాజంలో అందరూ సమానమే అనే భావనను మనం ఎప్పుడు ఆచరిస్తాం?" అని కనకం విద్యాసాగర్ ప్రశ్నించారు. దళితులపై ఇలాంటి చర్యలు జరుగుతున్నప్పుడు బీఆర్ఎస్‌లోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహా బీఆర్ఎస్‌లోని దళిత నాయకులు ఈ ఘటనను బహిరంగంగా ఖండించాలని కోరారు. దళితులపై వివక్ష, అవమానాలకు వ్యతిరేకంగా అన్ని దళిత సంఘాలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సంబంధిత దృశ్యాలు, ఆధారాలపై చట్టపరంగా పరిశీలించి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. "దళితులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనక్కి నెట్టే ప్రయత్నాలను ఇక సహించం. దళితుల ఆత్మగౌరవం, సమానత్వం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా, చట్టపరంగా పోరాటం కొనసాగిస్తాం" అని కనకం విద్యాసాగర్ స్పష్టం చేశారు. తెలంగాణలో అంటరానితనం, కుల వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సమాన గౌరవంతో జీవించే పరిస్థితులు ఏర్పడాలని ఆయన ఆకాంక్షించారు. దళితులపై జరుగుతున్న వివక్షను అన్ని సంఘాలు, ప్రజాస్వామిక శక్తులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. దళితులను చిన్నచూపు చూసే ఎవరైనా సరే వారి ఇంటి ముందు చావు డప్పు కొడతాం.

## నేడు వినాయక చవితి ఉత్సవాలపై సమావేశం

**- గ్రామ సర్పంచులు మండపాల నిర్వహకులు తప్పకుండా హాజరు కావాలి - మహేశ్వరం, ఎస్ హెచ్ ఓ రాఘవేందర్ రెడ్డి**

**మహేశ్వరం సెప్టెంబర్ 09 :** నేడు వినాయక చవితి ఉత్సవాలపై సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు మహేశ్వరం ఎస్ హెచ్ ఓ రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. నేడు (గురువారం) మధ్యాహ్నం మూడు గంటలకు మహేశ్వరం మండల కేంద్రంలోని పిఎస్ వై కన్వెన్షన్ హాల్లో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. గణేష్ మండపాలకు సంబంధించిన సూచనలు సలహాలు అలాగే నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి భద్రత ఏర్పాట్లపై అవగాహన కల్పిస్తామన్నారు. కావున ఈ కార్యక్రమానికి మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ సర్పంచులు ఉపసర్పంచ్ లు అన్ని శాఖల అధికారులు, వార్డు సభ్యులు గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు తప్పకుండా హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

## ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు ఖండిస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో రోడ్డు పై రాస్తారోకో

**- అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు 18వేలు ఫిక్స్ డ్ వేతనం నిర్ణయించాలి - ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి - దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి**

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 09 :** ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తున్న ఆశాలను పోలీసులు అక్రమ అరెస్టులు, నిర్బంధాన్ని నిరసిస్తూ లక్షెట్టిపేట్ పట్టణంలోని గాంధీచౌక్ వద్ద రోడ్డుపై రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. ఒకవైపు ప్రజాపాలన అంటూ మరొకవైపు నిర్బంధ పాలన కొనసాగించడం సరైనది కాదన్నారు. ఈ అప్రజాస్వామికమైన విధానాన్ని నిర్బంధ పాలనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మానుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి ఆశా వర్కర్లు తగిన బుద్ధి చెప్తారని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. శోభ ఆశా యూనియన్ (సీఐటీయు) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ...రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగించే లోపు ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలని,ఈపీఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఇతర డిమాండ్స్ అన్నింటిని పరిష్కరించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఫిక్స్ వేతనం రూ.18వేలు నిర్ణయించకపోతే నిరవధిక సమ్మెకు వెళతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమం మద్దతుగా కనికరపు అశోక్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, పద్మ ఆశా యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సభ్యులు, సునీత సువర్ణ లక్ష్మి మమత తదితరులు పాల్గొన్నారు.

## వైద్యరంగంలో శంషాబాద్ వాసికి డాక్టరేట్....!



**మానకొండూర్, సెప్టెంబర్9:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం శంషాబాద్ కు చెందిన గట్టు రమేష్ గౌడ్ మెడికల్ ఫిజిక్స్ రంగంలో డాక్టరేట్ వరించింది. మెడికల్ ఫిజిక్స్‌లో గట్టు రమేష్ గౌడ్ తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేయడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందజేసింది. ఇటీవల విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగురాం, భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ ఎల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా రమేష్ గౌడ్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గ్రామీణ ప్రాంతం నుండి విద్యారంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకోవడం శంషాబాద్ గ్రామానికే గర్వకారణం కాగా విద్యా ప్రస్థానంలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచిందని కుటుంబ సభ్యులు, మిత్రులు, సహచరులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మెడికల్ ఫిజిక్స్ రంగంలో మరింత విస్తృతంగా పరిశోధనలు చేపట్టి, క్యాన్సర్ చికిత్సతో పాటు వైద్యరంగ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని ఆకాంక్షిస్తూ గట్టు రమేష్ గౌడ్‌కు గ్రామస్తులు తోపాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 09:** సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించబడ్డాయి. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ అధ్యక్షత వహించగా, ఆయన సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు లాల్ సింగ్ నాయక్, లంబాడి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ హాజరై సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉద్యమ ప్రస్థానం, బంజారా సమాజ అభ్యున్నతి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ, సేవాలాల్ సేన గత పదకొండు సంవత్సరాలుగా బంజారా గిరిజనుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, రాజకీయ చైతన్యం, సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలపై నిరంతర ఉద్యమం కొనసాగిస్తూ సమాజంలో విశేష చైతన్యాన్ని తీసుకువచ్చిందన్నారు. సమాజ సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా స్పందిస్తూ, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు చూపుతున్న ఉద్యమ సంస్థగా సేవాలాల్ సేన విశ్వాసాన్ని సంపాదించుకుందని కొనియాడారు. అనంతరం సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ సేన స్థాపన నాటి నుండి బంజారా గిరిజనుల రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేస్తూ అనేక చారిత్రాత్మక విజయాలను సాధించిందన్నారు 500 జనాభా గల తండాలకు ప్రత్యేక గ్రామపంచాయతీల ఏర్పాటు, గిరిజన రిజర్వేషన్‌ను జనాభా దామాషా ప్రకారం 6 శాతం నుంచి 10 శాతానికి పెంచాలని చేపట్టిన ఉద్యమాలు, సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతికి అధికారిక గుర్తింపు, పోడు భూములకు హక్కు కల్పిస్తూ పోడు పట్టాల సాధన, తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఏడు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యోగులను తిరిగి తెలంగాణకు రప్పించడం, బంజారా సంస్కృతికి ప్రతీకలైన శీతల, తీజ్ పండుగలను రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానంలో నిర్వహించేలా కృషి చేయడం వంటి విజయాలు సేవాలాల్ సేన ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. బంజారా సమాజానికి ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ సేవాలాల్ సేన ప్రజాస్వామ్యబద్ధంగా స్పందిస్తూ బాధితులకు అండగా నిలిచి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న ఏకైక ఉద్యమ సంస్థగా ప్రజల విశ్వాసాన్ని పొందిందన్నారు. ఇక ముందు సేవాలాల్ సేన లక్ష్యాలుగా రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించడం, విద్యా వికాసం, యువత సాధికారత, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, బంజారా భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, రాజకీయ చైతన్యం, సంఘటిత సామాజిక శక్తి నిర్మాణం వంటి అంశాలను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ బాలాజీ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవి రాథోడ్, రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీను నాయక్, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్, భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ నాయక్, సేవాలాల్ ధర్మజాగరణ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరపల మంగీలాల్ నాయక్, సేవలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోత్ నాగరాజు నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపల లాలు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బట్టు హుస్సేన్ నాయక్, కిషన్ నాయక్, బాలు నాయక్, ప్రసాద్ నాయక్, సేవాలాల్ నాయక్, రమేష్ నాయక్, భద్రం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలి

## ఇంచార్జ్ ఎపిఏ జిఎం బండి సత్యనారాయణ

**రామగిరి, సెప్టెంబర్ 09:-** కోల్ ఇండియా స్థాయిలో పోటీలలో రాణించాలని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ అన్నారు.రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ ౘ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ఆర్.జి-త్రీ , ఎ.పి.ఎ, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య ప్రాంతీయ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాట్మెంటన్ పోటీలను నిర్వహించారు.ఇట్టి పోటీలను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం వివిధ క్రీడలలో పోటీలను నిర్వహిస్తుందన్నారు. కావున నిత్యం ఉద్యోగులు సాధన చేస్తూ, నైపుణ్యం సాధిస్తూ ముందుకెళ్లాలన్నారు. అంతేకాకుండా కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలలో నిర్వహించు పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించి మన రీజియన్ పేరు నిలబెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు దుగ్యాల తిరుపతి రావు, ఎన్. శ్రీనివాస రావు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివై పియం యం డి.ఆసిఫ్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బుర్ల సదానందం, ఇతర నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలి

- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్ ను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పి ఓ పి)తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టి జి పి సి బి) ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత విగ్రహాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరుల పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పర్యావరణహిత వినాయక చవితిని ప్రోత్సహించేందుకు 2,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని సూచించారు. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, జలాశయాలు కాలుష్యానికి గురికాకుండా నిమజ్జన కార్యక్రమాలను పర్యావరణ హితంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ సైంటిస్ట్ ఈ. కనకజ్యోతి, ఏవో పెద్దపల్లి బి. ప్రకాష్, సూపరింటెండెంట్ కోటేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణానికి సహకారమందించి మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్

**తిమ్మాపూర్, సెప్టెంబర్9:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంలో నిరుపేద కుటుంబానికి గృహ నిర్మాణానికై సొంత ఖర్చులతో సహకార అందించేందుకు ముందుకు వచ్చి మాజీ సర్పంచ్ ఎల్కపెల్లి సంపత్ తన మానవత్వాన్ని చాటుకున్నారు.గ్రామపంచాయతీ కార్మికుడిగా పనిచేసే ఎనగందుల సమ్మయ్య గత నాలుగు ఏండ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబం సొంత ఇల్లులేక అనేక ఇబ్బందులెదుర్కొంటున్నారు. దరఖాస్తు చేసుకున్నా సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడంతో మాజీ సర్పంచ్ ఎలుకపల్లి సంపత్ తన సొంత ఖర్చులతో ఇల్లు నిర్మించడానికి ముందుకు వచ్చి నేడు ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. మాజీ సర్పంచ్ ఎలుకపల్లి సంపత్ మాట్లాడుతూ.... మనిషి మనుగడకు కూడు,నీడ, గుడ్డ ముఖ్యమైనదని, ఓ నిరుపేద కుటుంబానికి ఈ రకంగా సహాయపడటం ఎంతో సంతోషంగా ఉందంటూ ఈలాంటి పేదవారిని ఆదుకోవాడాని ఎవరైనా ముందుకు వస్తే నా పూర్తి సహకారం అందిస్తానని సంపత్ హామీచ్చారు.తన పేదరికాన్ని దృష్టిలో పెట్టుకొని నిస్వార్థంగా తనకు సహాయం చేయడానికి ముందుకు వచ్చిన ఎలుకపల్లి సంపత్ కు ఎనగందుల పద్మ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల పెద్దలు, కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 15న హమాలీల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 09:** హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ( ఐ ఎఫ్ టి యు) జిల్లా ప్రధాన కార్యదర్శి జే. సీతారామయ్య, తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. బుధవారం ఇల్లెందు మండలం పోలారంలో ఏర్పాటుచేసిన హమాలి యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లు, గోదాములు,రైస్ మిల్లులు, సిమెంటు, ఎరువుల గోదాములు, పరిశ్రమలు, ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే వేలాది మంది హమాలీ కార్మికులు ఇప్పటికీ చట్టబద్ధమైన హక్కులు, రక్షణ లేకుండా పనిచేస్తున్నారని అన్నారు.హమాలీలు నిత్యం బరువులు మోయడం వల్ల అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హమాలీలకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, చట్టబద్ధమైన హక్కులు,సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సు విజయవంతానికి కార్మికులలో విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పందిర్లపల్లి వీరన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి యాసారపు వెంకన్న, ఉపాధ్యక్షులు బోడ మంచ, సహాయ కార్యదర్శి కొప్పుల శ్రీనివాస్, నాయకులు బి.కిషన్, బొర్ర బిక్షం,గడ్డం నాగేష్, చేబోతు రవి తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే వ్యక్తి కాళోజీ నారాయణ రావు

## జీఎంలు:-రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ

**రామగిరి, సెప్టెంబర్ 09:-** తెలంగాణ ప్రజల గుండెల్లో, చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే వ్యక్తి ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ కాళోజీ నారాయణరావు అని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ అన్నారు.బుధవారం జిఎం కార్యాలయం నందు నిర్వహించిన స్వర్గీయ కాళోజీ నారాయణ రావు 112వ జయంతి వేడుకలలో భాగంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమం ప్రతిధ్వనిగా కొనియాడబడతారని, రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారంగా కవిత్వం రాసిన ప్రజాకవిగా నిలిచారని తెలిపారు.నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా అతను కలమెత్తాడని, స్వాతంత్ర్యసమరయోధుడని, 1992 సంవత్సరంలో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్ పొందాడని, అతని జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించిందని, వారి పేరున ఆరోగ్య విశ్వవిద్యాలయం, కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు చేసి తెలంగాణ సమాజం వారి సేవలను గౌరవించిందన్నారు. తెలంగాణ సాధనకు ఆయన చేసిన కృషి, దృఢ సంకల్పం రాష్ట్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు దుగ్యాల తిరుపతి రావు, రవికుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, విభాగధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.సుదర్శనం, సి.జె.సురేఖ, రవికుమార్, కె.ఐలయ్య, అఫ్సర్ పాషా, ఆర్.రాజేశ్వరి, జి.ప్రశాంత్ జీవన్, తోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆదివరాహస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

**రామగిరి, సెప్టెంబర్ 09:-** కమాన్ పూర్ మండల కేంద్రంలో స్వయంభూగా వెలిసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆదివరాహస్వామి క్షేత్రం హుండీ లెక్కింపు బుధవారం క్షేత్రం ఆవరణలోని కళ్యాణ మండపంలో దేవాదాయ దర్మాదాయ శాఖ పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ ప్రవీణ్, ఇవో కొసన కాంతారెడ్డి, చైర్మన్ ముస్త్యాల దామోదర్ తో పాటు కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఇందులో హుండీ ఆదాయం రూ. 6,53,959లు వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. గతంలో ఏడాది మార్చి 25న హుండీ లెక్కింపు నిర్వహించడం జరిగిందని, 5 నెలల అనంతరం మళ్లీ హుండీ లెక్కింపు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో కమాన్ పూర్ ఎస్ఐ కొట్టె ప్రసాద్, స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ తో పాటు డైరెక్టర్లు, భక్తులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

# పెంచిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి

## - ఖమ్మం జిల్లా ప్రగతిశీల మహిళా సంఘం

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 09:** ప్రగతిశీల మహిళా సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెంచిన నిత్యవసర సరుకులు తగ్గించాలని బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి పాల్గొని మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నిత్యావ సర సరుకుల ధరలను అధికంగా పెంచి, సామాన్య, మధ్యతరగతి ప్రజల మీద భారాలు మోపినారని,ఇది దుర్మార్గమైన చర్యకు నిదర్శనమని ఆమె ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటికే ప్రజలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ మరియు ఆరోగ్యానికి సంబంధించిన మందులు వైద్య ఖర్చులు, కరెంటు చార్జీలు, బట్టలు వంటివి పెంచి నారు. ఈ చార్జీల భారాలతో ప్రజలుఇబ్బందులు పడుతూ ఉంటే మోడీ ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై నిత్యావసర సరుకుల అయినటువంటి మంచి నూనె, పంచదార, పప్పులు, ఉల్లిగడ్డ ధరలను పెంచి సామాన్య మానవులు బ్రతకలేని పరిస్థితికి దిగజార్చార ని ఆమె విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం పని చేస్తోందని మరియు ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి నేరవేర్చకుండా తిరిగి ప్రజల మీద భారాలు వేయటం అవకాశవాదం, ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆమె ప్రభుత్వం ని విమర్శించారు.ప్రధాని మోడీ ప్రభుత్వం అంబానీ, అదాని లాంటి కార్పొరేటు బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలు కాపాడటం కోసం పనిచేస్తున్నారు, పెంచిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, మరియు 14 రకాల నిత్యావసర సరుకులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించాలని ఆమె మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రజల కొనుగోలు శక్తికి అనుకూలంగా ధరలను నిర్దేశించాలి అని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద మోడీ ప్రభుత్వం పెంచిన అధిక ధరలను తగ్గించాలని నిరసిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలోవినూత్న నిరసన కార్యక్రమం. మరియు ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు టి.ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, జిల్లా నాయకులు గోగినపల్లి సరోజిని, పరిమిల, అనసూయ, సుగుణ, సునీత, సీత, నిర్మల, పుల్లమ్మ, మరియమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి మండలాధ్యక్షుడి పుట్టినరోజు వేడుక

**మానకొండూర్, సెప్టెంబర్9:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంది రాజిరెడ్డి పుట్టినరోజు వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజిరెడ్డితో కేక్ కోయించి శుభాకాంక్షలు తెలిపి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల ప్రజాసేవలో కొనసాగాలని నాయకులు ఆకాంక్షించారు. నాయకులు,మియపురం లక్ష్మణచారి,రాపాక ప్రవీణ్, సోన్నకుల శ్రీనివాస్, ప్రదీప్ యాదవ్, కుమార్ యాదవ్, రమణయ్య, అశ్విన్, బలరాం, నరేందర్,సునంద్, మర్రి అంజి, సురేష్, పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు వేడుకలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడలు వంచైనా 22ఏ భూముల సమస్యను పరిష్కరిస్తాం!

**● 10న ఖమ్మం కలెక్టరేట్ వద్ద బీజేపీ మహా ధర్నా ● మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి ● జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 09:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన 22ఏ (నిషేధిత ఆస్తుల జాబితా) భూముల సమస్యపై భారతీయ జనతా పార్టీ సమరశంఖం పూరించింది. దశాబ్దాలుగా అనుభవిస్తున్న సొంత భూములపై హక్కులు లేక, క్రయవిక్రయాలు చేసుకోలేక లక్షలాది మంది పేద, మధ్యతరగతి రైతాంగం తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అలసత్వానికి నిరసనగా, బాధిత రైతులకు అండగా ఈ నెల 10వ తేదీన ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ 'మహా ధర్నా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రిజిస్ట్రేషన్ చట్టం 22ఏ కింద అకారణంగా వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు తమ పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులు, వైద్య అవసరాల కోసం భూములు అమ్ముకోలేక కన్నీరుమున్నీరవుతున్నారని నెల్లూరి కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలను సరిదిద్దుతామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం సైతం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాకే చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ శాఖను పర్యవేక్షిస్తున్నప్పటికీ, సొంత జిల్లాలోనూ, రాష్ట్ర వ్యాప్తంగానూ ఉన్న ఈ ప్రధాన సమస్యను పరిష్కరించడంలో ఏమాత్రం చిత్తశుద్ధి చూపకపోవడం దారుణమన్నారు. బాధితుల పక్షాన నిలబడలేని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆ పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని, ఆయన తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల సాధనలో భారతీయ జనతా పార్టీ ఎన్నటికీ వెనకడుగు వేయదని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే ప్రభుత్వ మెడలు వంచైనా సరే 22ఏ జాబితాలో అకారణంగా చేర్చిన భూములు తొలగింపజేసి తీరుతామని హెచ్చరించారు. పాలకులు కళ్లు తెరిపించేలా, ప్రభుత్వానికి బాధితుల ఆవేదన తెలిసేలా ఈ నెల 10న జరగబోయే మహా ధర్నాను ఒక చారిత్రక ఘట్టంగా మలచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో పాటు.. 22ఏ చట్టం వల్ల నష్టపోయిన బాధితులు, రైతులు, సామాన్య ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని నెల్లూరి కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలి

**● మాజీ శాసనసభ్యులు మహేశ్వరం అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్చార్జి కేఎల్ఆర్‌కు వినతి**

**మహేశ్వరం సెప్టెంబర్ 09 :** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని వనస్థలిపురంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, వసతి (మహేశ్వరం) గృహంలో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థినులకు అవసరమైన కనీస మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని పేరెంట్స్ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ,మహేశ్వరం అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు చెరుకూరి జంగయ్య ఆధ్వర్యంలో తుక్కుగూడ లోని క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కారించాలని ఆదేశించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.ప్రస్తుతం ఉన్న వసతి గృహ భవనం విద్యార్థినులకు అనుకూలంగా లేకపోవడంతో, దానిని తక్షణమే అక్కడి నుండి తరలించి విశాలమైన, సురక్షితమైన భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా బెంచీలు, ఇతర ఫర్నిచర్ అందుబాటులో లేవని తెలిపారు. వసతి గృహంలో విద్యార్థినులకు సరిపడా పడకలు, బెడ్‌కాట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో తగినంత లైట్లు, ఫ్యాన్లు లేకపోవడంతో దోమల సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ లేకపోవడం వల్ల పరిపాలనా సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. పాఠశాలకు ప్రిన్సిపాల్‌తో పాటు అవసరమైన బోధనేతర సిబ్బంది, కేర్‌టేకర్, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని కోరారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం, విద్యాభ్యాసాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సురక్షితమైన వసతి గృహ భవనం, తాగునీరు, బెంచీలు, పడకలు, ఫ్యాన్లు, లైట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు చెరుకూరి జంగయ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర ఘరానా చైన్స్ స్నాచర్ అరెస్టు...

**● ఒంటరి మహిళలే టార్గెట్‌గా బంగారు ఆభరణాల చోరీ ● దొంగిలించిన బైకులపై సంచరిస్తూ మహిళల మెడలో ఆభరణాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసిన పెద్దపల్లి పోలీసులు**

**పెద్దపల్లి ప్రతినిధి :** ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని బంగారు ఆభరణాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ఘరానా చైన్స్ స్నాచర్ ను పెద్దపల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నేర పూర్తి వివరాలను పెద్దపల్లి డిసిపి భూక్య రామ్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చైన్ స్నాచింగ్ లనే ప్రవృత్తిగా మార్చుకున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షామిలి జిల్లా కాన్పూర్ కాల గ్రామం భావారియ తెగకు చెందిన కాలీ రామ్/ తండ్రి హరి సింగ్ హరి సింగ్ /వయసు 38 సంవత్సరాలు ఇతనికి భార్య ఇద్దరు కూతుళ్లు కుమారుడు కాగా పాల వ్యాపారం చేస్తూ జీవించేవాడని జల్సా ల కోసం అలవాటు పడి స్నేహితుడైన అల్లావుద్దీన్ పూర్ గ్రామానికి చెందిన కపిల్/ తండ్రి ముఖేష్ తో కలిసి యూపీ నుంచి బయలుదేరి దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై సంచరిస్తూ ఒంటరి మహిళల మెడలోని బంగారు ఆభరణాలను తెంపుకొని అమ్ముకోవాలని నిర్ణయించుకుని ఈ సంవత్సరం మార్చి నెల చివరలో యూపీ నుంచి రైల్లో పెద్దపల్లి రైల్వే స్టేషన్ కు వచ్చి రైల్వే కాలనీలో పల్సర్ బైక్ దొంగిలించి పెద్దపల్లి పట్టణంలో కలియతిరిగి చివరకు బంధం పల్లిలో నర్సమ్మ అనే మహిళ మడలోని రెండు తులాల బంగారు గొలుసును దొంగిలించి రామగుండం వైపు వెళ్లి రామగుండంలోని ఓల్డ్ బజార్లో కోల కుసుమ అనే మహిళ మెడలోని 45 గ్రాముల సూత్రాన్ని లాక్కొని వెళ్లి ద్విచక్ర వాహనాన్ని బళ్లార్షాలో వదిలేసి ఉత్తరప్రదేశ్ వెళ్లి మళ్లీ మే నెల చివరలో పెద్దపల్లికి వచ్చి పెద్దపల్లి బస్ స్టాండ్ ముందు పార్క్ చేసిన పల్సర్ బైక్ ను దొంగలించి పట్టణంలో మరియు గోదావరిఖని ఏరియాలో తిరిగినారు కాని వారు దొంగతనం చెయ్యడానికి ఎలాంటి అవకాశం రాకపోయేసరికి వారు దొంగలించిన బైక్ ను బెల్లంపల్లి వద్ద దాచి పెట్టి ట్రైన్ లో ఉత్తరప్రదేశ్ కు వెల్లడం జరిగిందని తెలిపారు.ఆతర్వాత వారిద్దరు ట్రైన్ లో ఆగస్టు 17న పెద్దపల్లికి వచ్చి రాత్రి అందాదా 8.30 గంటలకు పెద్దపల్లి పట్టణంలో కాలేజీ మైదానం దగ్గరలో పల్సర్ బైక్ ను దొంగతనం చేసి దానిపై పెద్దపల్లి పట్టణంలో తిరుగుతూ లక్ష్మి నగర్ నందు రోడ్ పై ఉన్న నూనె స్వరూప అనే మహిళ మేడలో నుండి 30 గ్రాముల బంగారు పుస్తెలతాడు తెంపుకొని బైక్ పై ఇద్దరు పారిపోయినారు. ఆతర్వాత ఆ బైక్ ను వాంకిడి-బల్హార్ష మధ్య ఏరియాలో పడవేసి రైలు లో ఉత్తరప్రదేశ్ కి వెళ్ళడం జరిగిందని,గత వరుస సంఘటనలను నిలువరించడానికి రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా గారు, పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి, ఏసిపి కృష్ణ గార్ల పర్యవేక్షణలో ఒక స్పెషల్ టీం ను ఏర్పాటు చేయగా, సీసీ కెమెరాల ద్వారా , సాంకేతికత ఆధారంగా నేరస్తులు ఉత్తరప్రదేశ్ కి చెందిన భవారియ గ్యాంగ్ వారని గుర్తించి స్పెషల్ టీం సభ్యులను ఉత్తరప్రదేశ్ కి పంపడం జరిగినది, వారు కీలక సమాచారాన్ని సేకరించి నేరస్తులు మల్లి పెద్దపల్లి వైపుకు వస్తున్నారనే విశ్వసనీయమైన సమాచారం మేరకు కలిరామ్ గతంలో దొంగలించిన బెల్లంపల్లి వద్ద దాచిన పల్సర్ బైక్ ను తీసుకొని పెద్దపల్లి రైల్వే స్టేషన్ వద్దకు వచ్చి కపిల్ గురించి వేచి చూస్తుండగా బుధవారం ఉదయం 9.45 గంటలకు అతడిని పట్టుకోవడం జరిగిందని, అతని వద్ద నుండి దొంగలించిన పల్సర్ బైక్ ను స్వాధీనం చేసుకొని, విచారణలో కేసు సొత్తు పరారిలో వున్న కపిల్ వద్ద వున్నట్లు తెలిపినాడు.నేరస్తుడిని పట్టుకోవడంలో చాకచక్యం గా వ్యవహరించిన పెద్దపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. ప్రవీణ్ కుమార్, ఎస్సై కే. నరేష్, సి సి ఎస్ ఐ - ఎండి.నసీర్, హెచ్ సి.సుధాకర్, కానిస్టేబుల్ ప్రభాకర్, విజయ్ కుమార్, ప్రేమ్ సాగర్ లను పెద్దపల్లి ఏసిపి అభినందించారు.

# గణేష్ మండపాల నిర్వాహకులతో సిఐ శ్రీలత ప్రత్యేక సమావేశం

**మానకొండూర్, సెప్టెంబర్9:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో గణేష్ మండపాల నిర్వహకులతో స్థానిక సిఐ పి.శ్రీలత బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సిఐ మాట్లాడుతూ..... గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మండలం వ్యాప్తంగా పోలీస్ శాఖ పరిధిలో నాలుగు క్లస్టర్లు ఏర్పాటు చేశామని, ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పటు చేసుకోవాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, కేవలం పోలీస్ అనుమతితో సౌండ్ సిస్టం అనుమతినిస్తామన్నారు. మండపాల వద్ద ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకుని, మండపాల్లో భక్తిశ్రద్ధలతో కూడిన పాటలను వేయాలని, ఇతరుల ఇబ్బంది పెట్టే పాటలు వేయకుండా రాత్రి వేళలో నిర్వాహకులు తప్పకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి అల్లర్లు సృష్టించారని సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నిర్వాహకులకు ఏదైనా ఇబ్బందులుంటే పోలీసులకు సమాచారం అందివ్వాలని సిఐ సూచించారు.స్థానిక పోలీస్ సిబ్బంది, ఆయా సర్పంచ్లు, మండపాల నిర్వాహకులు సమావేశంలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 22, 23న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు:** సెప్టెంబర్ 22, 23 తేదీలలో పటాన్ చేరు కేంద్రంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో వేడుకల ఏర్పాట్లపై ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఇరవై ఐదు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22న ప్రభుత్వ ఉపాధ్యాయులకు, 23న ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు పటాన్ చేరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులందరూ హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ లు నాగేశ్వర రావు నాయక్, సుధాకర్, విజయ్ కుమార్, పౌలిన, భాస్కర్, రామచంద్రపురం జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ రాథోడ్, ప్రైవేట్ పాఠశాల ప్రతినిధులు తేజ, ప్రభాకర్ రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కల నిర్మూలన పనులను పరిశీలించిన సర్పంచ్

**రామగిరి, సెప్టెంబర్ 09:**-రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో పిచ్చి మొక్కల నిర్మూలనకు చేపడుతున్న గడ్డి మందు స్ప్రే పనులను గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమా పివిరావు బుధవారం పరిశీలించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు సిబ్బంది చేపడుతున్న స్ప్రేయింగ్ ప్రక్రియను ఆమె పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య చర్యలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. పిచ్చి మొక్కలు అధికంగా పెరిగిన ప్రాంతాలను గుర్తించి వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, ఖాళీ ప్రదేశాలు, ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి రోడ్డు చదును పనులను పరిశీలించిన సర్పంచ్

**రామగిరి, సెప్టెంబర్ 09:-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పరిధిలోని పల్లె మీద నుంచి కుంట వరకు ఉన్న మట్టి రోడ్డు చదును పనులను గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమపివిరావు బుధవారం పరిశీలించారు. ట్రాక్టర్ బ్లేడ్ సహాయంతో రహదారిని చదును చేసి, రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దుతున్న పనుల పురోగతిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు మాట్లాడుతూ గ్రామ పరిధిలోని మట్టి రోడ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు, రైతులకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా అవసరమైన మరమ్మతు, చదును పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పల్లె మీద నుంచి కుంట వరకు ఉన్న రహదారిని సక్రమంగా చదును చేసి ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో రహదారులు అధ్వానంగా మారకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రోడ్డు చదును పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ తరపున ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భద్రపు ప్రవళిక ప్రశాంత్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూమి రీ సర్వే పనులను పరిశీలించిన సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు

**రామగిరి, సెప్టెంబర్ 09:**-రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో జరుగుతున్న భూమి రీ సర్వే పనులను బుధవారం గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమపివిరావు పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా అధికారులు, సర్వే సిబ్బంది చేపడుతున్న పనుల పురోగతిని ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు మాట్లాడుతూ భూముల వివరాల నమోదు, హద్దుల నిర్ధారణ వంటి అంశాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రీ-సర్వే పనులను పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టాలని సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకుని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.గ్రామంలో రీ సర్వే పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బంది, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాల పనులను పరిశీలించిన సర్పంచ్ పల్లె ప్రతిమ

**రామగిరి, సెప్టెంబర్ 09:-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో చేపడుతున్న వీధి దీపాల ఏర్పాటు పనులను గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమపివిరావు బుధవారం పరిశీలించారు. గ్రామంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ దీపాలు, విద్యుత్ కనెక్షన్ల పనుల పురోగతిని ఆమె పరిశీలించి సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వీధిలో తగినంత వెలుతురు ఉండేలా వీధి దీపాల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, భద్రతకు ఎలాంటి ఆటంకం లేకుండా అవసరమైన ప్రాంతాల్లో అదనపు దీపాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. వీధి దీపాల సక్రమ నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు పంచాయతీ తరఫున నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ కుక్కు పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**రామగిరి మండల విద్యాధికారి కొమ్మురయ్య**



**రామగిరి, సెప్టెంబర్ 09:-** రామగిరి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అసిస్టెంట్ కుక్ పోస్ట్ భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించబడినని రామగిరి మండల విద్యాధికారి కొమ్మురయ్య అన్నారు. దరఖాస్తులు 10.09.26 నుండి12.09.26 వరకు స్వీకరించబడును. దరఖాస్తు చేసుకునేవారు ఏ కులానికి చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు వయస్సు25-55 సంవత్సరాల మధ్య ఉండి ఏడవ తరగతి పాస్ అయిన వారికి అవకాశం ఉంటుంది జీతం 9750 కావున దరఖాస్తు చేసుకునేవారు రామగిరి మండల వాస్తవ్యులు అయి ఉండాలి కావున దరఖాస్తు చేసుకునేవారు కేజీబీవీ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ కు దరఖాస్తులు ఇవ్వగలరని రామగిరి మండల విద్యాధికారి కొమ్మురయ్య అన్నారు.

# స్త్రీ నిధి రికవరీని 95 శాతానికి, రుణాల పంపిణీని 100 శాతానికి చేరేలా చర్యలు చేపట్టాలి

● సెప్టెంబర్ నెలాఖరులోగా రికవరీని 90 శాతానికి పెంచాలి ● "మన స్త్రీ నిధి" యాప్ వినియోగం తప్పనిసరి

● స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీచేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి :** స్త్రీ నిధి రుణాల రికవరీని 95 శాతానికి, అర్హులైన వారికి రుణాల పంపిణీని 100 శాతానికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశంలో రికవరీ, రుణాల పంపిణీ, డిజిటల్ సేవల వినియోగం, సుస్థిర జీవనోపాధులు, ఆర్థిక క్రమశిక్షణ తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో 74 శాతంగా ఉన్న స్త్రీ నిధి రికవరీని సెప్టెంబర్ నెలాఖరులోగా గణనీయంగా పెంచి కనీసం 90 శాతానికి చేర్చాలని ఆదేశించారు. స్త్రీ నిధి క్రెడిట్ లక్ష్యాన్ని కూడా సెప్టెంబర్ నెలాఖరులోగా కనీసం 70 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీ 100 శాతం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీవనోపాధి రుణాల మంజూరును మరింత పెంచాలని, మహిళలు సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకునేలా రుణాలను సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. **"మన స్త్రీ నిధి" యాప్ వినియోగం తప్పనిసరి:** స్త్రీ నిధి లావాదేవీల్లో పారదర్శకత, వేగవంతమైన అడ్జస్ట్‌మెంట్, సమగ్ర సమాచార నిర్వహణ కోసం అన్ని స్థాయిల్లో "మన స్త్రీ నిధి" యాప్ వినియోగాన్ని తప్పనిసరి చేయాలని ఆదేశించారు. రికవరీ, నగదు బదిలీ ప్రక్రియలు 100 శాతం డిజిటల్ విధానంలో జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ వివరాలు తదితర సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకతను పెంచాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో యాప్ వినియోగంపై సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు, సాంకేతిక సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. **అవకతవకలకు పాల్పడే వివోఏ లపై కఠిన చర్యలు...** స్త్రీ నిధి కార్యకలాపాల్లో అవకతవకలకు పాల్పడే వివోఏ లపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్త్రీ నిధి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని సంఘాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని, అవసరమైన సందర్భాల్లో రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. **జీరో రికవరీ సంఘాలపై ప్రత్యేక దృష్టి :** జిల్లాలో జీరో రికవరీ ఉన్న స్వయం సహాయక సంఘాల సంఖ్యను సున్నాకు తీసుకురావాలని ఆదేశించారు. రికవరీలో వెనుకబడిన సంఘాలను గుర్తించి, వాటికి సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రికవరీ ప్రక్రియలో సంఘాల సభ్యులకు రుణ చెల్లింపుల ప్రాధాన్యత, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించాలని అన్నారు. రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా సంఘాల క్రెడిట్ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. **క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి సహకారం అందించాలి:** రికవరీతో పాటు ఇతర విధుల నిర్వహణలో

స్త్రీ నిధి, మెప్మా, సెర్ప్ సిబ్బందికి అన్ని స్థాయిల్లో పూర్తి సహకారం అందించాలని సూచించారు. విధుల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని, రికవరీ లక్ష్యాల సాధనకు శాఖల మధ్య సమన్వయం మరింత పెంచాలని ఆదేశించారు. తక్కువ పనితీరు ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి జూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్ మండలాల్లో స్త్రీ నిధి రికవరీ పనితీరును మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తక్కువ పనితీరు కనబరుస్తున్న క్లస్టర్లను గుర్తించి, వాటి వారీగా రికవరీ లక్ష్యాలను నిర్దేశించుకుని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రికవరీలో వెనుకబడిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు. సుస్థిర జీవనోపాధుల ఏర్పాటుకు స్త్రీ నిధిని వినియోగించాలి... స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. మహిళలకు సుస్థిర జీవనోపాధులు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు స్త్రీ నిధి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలకు అవసరమైన రుణ సదుపాయాలను స్త్రీ నిధి ద్వారా అనుసంధానం చేయాలని, అర్హులైన మహిళా సంఘాలకు రుణాలు అందేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. స్త్రీ నిధి రుణాల సద్వినియోగం, సకాలంలో రుణ చెల్లింపులు, ఆర్థిక క్రమశిక్షణపై సంఘాల సభ్యులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. సెప్టెంబర్ నెలాఖరు లక్ష్యాలను ప్రతి స్థాయిలో కచ్చితంగా సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ కాలిందిని, సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి అధికారులు, సిబ్బంది, జిల్లా సమాఖ్య ఓబీలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

● మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి ● పీఎం సేతు, ప్రగతి పోర్టల్‌పై సమగ్ర వివరాలు విశ్లేషించాలి

● పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్‌పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 09:** జిల్లాలో గుర్తించిన పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ లతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి 142 పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక, ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడం, ప్రభుత్వ భూములతో ల్యాండ్ బ్యాంక్ గుర్తింపు, పీపీపీ విధానంలో పర్యాటక ప్రాజెక్టులు, మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళిక, జ్ఞాన భారతం మిషన్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడంతో పాటు, పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో గుర్తించిన వీకెండ్ గేట్‌వే పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌళిక వసతులు, రహదారులు, త్రాగునీరు, మరుగుదొడ్లు, భద్రత, సమాచార కేంద్రాలు, తదితర సౌకర్యాలను కల్పించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, అవసరమైన మౌళిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, పర్యాటక ప్రచారం తదితర అంశాలను స్పష్టమైన కాల పరిమితులతో పొందుపరచాలని తెలిపారు. జ్ఞాన భారతం మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించాలని ఆదేశించారు. పర్యాటక అభివృద్ధితో

పాటు నైపుణ్యాభివృద్ధిపై కూడా దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, ఇతర స్కిల్లింగ్ సంస్థల ఇన్‌చార్జీలు, డీఆర్‌డీఏ అధికారులు కలిసి పీఎం సేతు, ప్రగతి పోర్టల్‌కు సంబంధించిన వివరాలను సమగ్రంగా విశ్లేషించాలని ఆదేశించారు. ఆయా పోర్టళ్లలో అందుబాటులో ఉన్న అవకాశాలు, నైపుణ్య శిక్షణకు సంబంధించిన కార్యక్రమాలు, జిల్లాకు ఉపయోగపడే అంశాలను గుర్తించి నివేదిక అందించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో స్థానిక యువతకు గైడ్‌లు, హాస్పిటాలిటీ, ఫుడ్ సర్వీసెస్, టూరిజం సంబంధిత ఇతర నైపుణ్యాల్లో శిక్షణ అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. యువతను పర్యాటక రంగంతో అనుసంధానం చేసేందుకు యూత్ టూరిజం క్లబ్‌లను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌ను అభివృద్ధి చేసి, విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం శాఖల మధ్య సమన్వయం పెంచాలని, ప్రతి అంశంపై స్పష్టమైన బాధ్యతలు అప్పగించి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో సమీక్షలో జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు : కాప్రాలో 5 అడుగుల లోపు విగ్రహాలకే అనుమతి

● పెద్ద విగ్రహాలకు ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలు

**మేడ్చల్, సెప్టెంబర్ 09:** గణేష్ నిమజ్జనాన్ని సురక్షితంగా, సజావుగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. భక్తుల భద్రతతో పాటు సహజ జలవనరుల పరిరక్షణ, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మల్కాజిగిరి కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్తా, తో కలిసి బుధవారం వివిధ చెరువులు, కుంటలు, నిమజ్జన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. రాంపల్లి లేక్, కాప్రా చెరువు బేబీ పాండ్, ఏదులాబాద్ లేక్, ఉప్పల్ నల్లచెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, భద్రతా చర్యలు, అప్రోచ్ రోడ్లు, లైటింగ్, భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు, ఫైర్‌సేఫ్టీ సదుపాయాలు, కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ సురక్షితంగా, క్రమబద్ధంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని కాప్రా చెరువులో ఈసారి పెద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. చెరువు సమీపంలోని బేబీ పాండ్‌లో 5 అడుగుల లోపు ఉన్న చిన్న గణేష్ విగ్రహాలను మాత్రమే నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. చిన్న విగ్రహాలను నిర్దేశిత కృత్రిమ నిమజ్జన కొలనులోనే నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బేబీ పాండ్‌ను పూర్తిగా ఖాళీ చేసి అడుగుభాగంలో పేరుకుపోయిన మట్టి, పూడికను తొలగించాలని, సమగ్రంగా శుభ్రం చేసి తాజా నీటితో నింపాలని ఆదేశించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగినంత లైటింగ్, అప్రోచ్ రోడ్లు, సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. రాంపల్లి లేక్, నాగారం వార్డు, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. పెద్ద, చిన్న గణేష్ విగ్రహాలకు వేర్వేరు నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న విగ్రహాల కోసం చెరువుకు సమీపంలో బేబీ పాండ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బేబీ పాండ్‌ను భవిష్యత్తులో బతుకమ్మ వేడుకలకు కూడా ఉపయోగించుకునే విధంగా నిర్మించి నిర్వహించాలని చెప్పారు. నిమజ్జన ప్రాంతంలో క్రేన్లు, వైద్య సహాయం, అంబులెన్స్‌లు, ఫైర్‌సేఫ్టీ సదుపాయాలు, కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువు వద్ద ఉన్న పాత గణేష్ విగ్రహాలను తొలగించడంతో పాటు ఈ ఏడాది నిమజ్జనం అనంతరం విగ్రహాలను కూడా సకాలంలో తొలగించాలని సూచించారు. ఏదులాబాద్ లేక్ వద్ద కూడా నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్.. చిన్న గణేష్ విగ్రహాల కోసం చెరువుకు సమీపంలో బేబీ పాండ్ నిర్మించాలని ఆదేశించారు. దీనిని భవిష్యత్తులో బతుకమ్మ వేడుకలకు కూడా ఉపయోగించుకునేలా తగిన విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులో ఉన్న పాత గణేష్ విగ్రహాలను తొలగించడంతో పాటు ఈ ఏడాది నిమజ్జనం అనంతరం విగ్రహాలను సత్వరమే తొలగించాలని చెప్పారు. నిమజ్జన ప్రాంతంలో పూడిక, మట్టి, వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. క్రేన్లు, వైద్య సదుపాయాలు, అంబులెన్స్‌లు, ఫైర్‌సేఫ్టీ, కంట్రోల్‌రూమ్, లైటింగ్, అప్రోచ్ రోడ్లను సిద్ధం చేయాలని సూచించారు. ఉప్పల్ నల్లచెరువు బేబీ పాండ్ వద్ద కూడా ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. చిన్న గణేష్ విగ్రహాలను కృత్రిమ నిమజ్జన కొలనులోనే నిమజ్జనం చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాండ్‌ను పూర్తిగా ఖాళీ చేసి పూడిక, మట్టిని తొలగించి శుభ్రం చేసి తాజా

నీటితో నింపాలని సూచించారు. భక్తులు, సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు తగిన లైటింగ్, అప్రోచ్ రోడ్లు, భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని చెప్పారు. నిమజ్జన ప్రాంతాల్లో సేకరించే పూలు, ఇతర సేంద్రియ పూజా సామగ్రిని ప్రత్యేకంగా సేకరించి సహజ ఎరువుగా ప్రాసెస్ చేసేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. నిమజ్జనం సందర్భంగా ఉత్పత్తయ్యే ఇతర వ్యర్థాలను కూడా సక్రమంగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని ఆదేశించారు. నిమజ్జనం అనంతరం విగ్రహాలు, పూజా సామగ్రి, వ్యర్థాలను సత్వరమే తొలగించేలా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జనం పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ స్పష్టం చేశారు. సహజ చెరువులపై నిమజ్జన భారం తగ్గించడం, జలవనరులను పరిరక్షించడం, భక్తుల భద్రతను నిర్ధారించడం, నిమజ్జన ప్రాంతాలను పరిశుభ్రంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గణేష్ నిమజ్జనం భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ బాధ్యతతో కూడిన కార్యక్రమంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సురక్షిత నిమజ్జనం, పరిశుభ్రమైన నిమజ్జన ప్రాంతాలు, పరిరక్షిత జలవనరులే లక్ష్యంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ అవసరమైన అన్ని ఏర్పాట్లను పటిష్టంగా చేపడుతోందని అధికారులు తెలిపారు.

## మేరా రేషం మేరా అభిమాన్ 2.0 లో భాగంగా పట్టు పరిశ్రమపై అవగాహన కార్యక్రమం

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 09:** మేరా రేషం మేరా అభిమాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా, పట్టు పరిశ్రమ (సెరికల్చర్) మరియు రైతుల ఆర్థికాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం 2026 సెప్టెంబర్ 9న తెలంగాణలోని ఖమ్మం జిల్లా, ఏర్రుపాలెం మండలం, వెంకటాపురంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని బెంగళూరులోని కేంద్ర పట్టు పరిశ్రమ మండలి (సెంట్రల్ సిల్క్ బోర్డ్), తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ మరియు వ్యవసాయ శాఖ సమన్వయంతో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో డా. జి. సుబ్రహ్మణ్యం సెంట్రల్ సిల్క్ బోర్డ్, శ్రీమతి అనసూయ జాయింట్ డైరెక్టర్, సెరికల్చర్, శ్రీమతి వాణిశ్రీ అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ, శ్రీ బండారు నరసింహారావు-గావీజ చైర్మన్, మధిర, శ్రీ కామేశ్వరరావు ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, శ్రీ దేబరాజు అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ పాల్గొనగా, స్థానిక రైతులు కూడా పాల్గొన్నారు. ఎల్ నినో వంటి మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పట్టు పరిశ్రమ యొక్క ప్రాముఖ్యతను ఈ కార్యక్రమంలో ప్రధానంగా వివరించారు. పట్టు సాగు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు మరియు ఆర్థికాభివృద్ధి వ్యూహాలపై కూడా చర్చించారు.

## ఓటర్ల సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: తహసీల్దార్ సుమన్

పన్నూరులో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ హియరింగ్

సర్పంచ్ మహేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**రామగిరి, సెప్టెంబర్ 9:**–ఓటర్ల సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని రామగిరి మండల తహసీల్దార్ సుమన్ సూచించారు. రామగిరి మండలం పన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యంలో ఓటర్లకు ప్రత్యేక హియరింగ్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల తహసీల్దార్ సుమన్, డిప్యూటీ తహసీల్దార్ మానస లు పాల్గొన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సార్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న 15 నుంచి 20 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జాబితాలో ఏవైనా దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు ఈ హియరింగ్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని సర్పంచ్ చిందం మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ మహేష్, జీపీవో వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి, వార్డు సభ్యులు,మున్ని, చేతి సుధాకర్, తన్నీరు ప్రదీప్,కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

## శ్రీచైతన్యలో ఎంబీఏ,ఎంసీఏ ఓరియెంటేన్ కార్యక్రమం

**తిమ్మాపూర్, సెప్టెంబర్9:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ ఎంసీఏ ప్రథమ సంవత్సరం నూతన విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసన అనంతరం మాట్లాడుతూ.... విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, వృత్తి పట్ల విద్యార్థులు విజ్ఞానం కలిగి ఉంటే ప్రాంగణ నియామకాల్లో ఎంపిక అవుతారని సూచించారు. కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి మాట్లాడుతూ..... విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించి పోషక విలువల ఆహారం అందిస్తే మేదస్సు పెంపొందుతుందని చెడు అలవాట్లను అలవాటు చేసుకోకుండా విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టరు జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... కళాశాల స్థాపించినప్పటి నుండి నాణ్యమైన విద్యతో 100% ఉత్తీర్ణులై ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని అనుభవజ్ఞులైన కళాశాల అధ్యాపకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఠాగూర్ సందీప్ ప్రసాద్, ఎంసీఏ విభాగాధిపతి లక్ష్మీ రెడ్డి ప్రియాంక మాట్లాడుతూ... కళాశాల సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరుతూ జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీకల్ రూపొందించిన మార్గదర్శకాలను, పరీక్ష ప్రణాళికలను విద్యార్థులకు వివరించారు. కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ ఆర్ హరిష్ ,కళాశాల విభాగాధిపతులు, మీడియా ఇంచార్జ్ గొంతు రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాళోజి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

రామగిరి మండల ఎంపీడీఓ శైలజరాణి



**రామగిరి, సెప్టెంబర్ 09:–** తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక చైతన్యవాది కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీఓ శైలజరాణి, ఎంపీవో సమ్మిరెడ్డి లు కాళోజి నారాయణ రావు ఫొటోకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ఆకాంక్షలను తన కలంతో ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి కాళోజి అని ఎంపీడీఓ శైలజరాణి కొనియాడారు. తెలంగాణ మట్టి మనిషిగా, ప్రజల పక్షాన నిలిచిన కవిగా కాళోజి నారాయణరావు తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు."నా గొడవే నా గొడవ" అంటూ సమాజంలోని అన్యాయాలు,అసమానతలు, దోపిడీ, అణచివేతలపై కాళోజి తన రచనల ద్వారా ప్రశ్నించారని మంత్రి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు, సామాజిక న్యాయం, మానవత్వం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమం లో రామగిరి మండల ఎంపీడీఓ శైలజరాణి, ఎంపీవో సమ్మిరెడ్డి జూనియర్ అసిస్టెంట్లు ఎండీ షరీఫ్, స్వరూప, టీఏ అఖిల, అన్ని గ్రామ పంచాయతీ ల కార్యదర్శులు పాల్గొన్నారు.

# పట్టుబిగించిన ఈస్ట్ జోన్

## స్పోర్ట్స్

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్

మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.

## ఆటగాళ్లను రిటైర్డ్ ఔట్‌గా పంపడమేంటి?

### టీమిండియా మాజీ క్రికెటర్ కైఫ్ అసహనం

ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆటగాళ్లను రిటైర్డ్ ఔట్‌గా బయటకు పంపించాడాన్ని టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తప్పు బట్టాడు. ఇది ఏ మాత్రం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఇప్పటికే ఇద్దరు బ్యాటర్లు రిటైర్డ్ ఔట్‌గా బయటకు వచ్చారు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్.. తమ బ్యాటర్ తిలక్ వర్మను రిటైర్డ్ ఔట్‌గా బయటకు రప్పించడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. 23 బంతుల్లో 25 పరుగులే చేసి తీవ్ర తడబడిన తిలక్ వర్మను.. ముంబై ఇండియన్స్ రిటైర్డ్ ఔట్‌గా బయటకు రప్పించింది. ఇది సరికాదని తీవ్ర విమర్శలు రాగా.. తలకు బంతి తగలడంతోనే అతన్ని బయటకు పంపించామని హార్దిక్ పాండ్యా వివరణ ఇచ్చాడు. పంజాబ్ కింగ్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లోనూ చెన్నై సూపర్ కింగ్స్ తమ బ్యాటర్ అయిన డెవాన్ కాన్వే(69 నాటౌట్)ను బయటకు రప్పించింది. ఈ రెండు సందర్భాల్లో ఆ జట్లకు ఓటమే ఎదురైంది. తాజాగా ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా స్పందించిన మహమ్మద్ కైఫ్.. అసహనంతో ఆయా జట్లు రిటైర్డ్ ఔట్ నిర్ణయాన్ని తీసుకుంటున్నాయని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2020 సీజన్‌లో రాహుల్ తెవాటియా బ్యాటింగ్‌కు ఇలానే ఫ్రస్టేట్ అయి రిటైర్డ్ ఔట్‌గా బయటకు పంపిస్తే అతను 5 బంతుల్లో 5 సిక్స్‌లు కొట్టి మ్యాచ్ గెలిపించేవాడా? అని కైఫ్ ప్రశ్నించాడు.'అసహనంతో జట్లు రిటైర్డ్ ఆప్షన్ ఉపయోగించుకుంటున్నాయి. ఈ చిట్కా చాలా తక్కువ సందర్భాల్లో ఫలితం ఇస్తోంది. అతి తక్కువ మంది బ్యాటర్లు మాత్రమే తొలి బంతిని సిక్సర్‌గా తరలిస్తారు. చాలా సందర్భాల్లో క్రీజులో పోరాడుతున్న బ్యాటర్లే విజయాలను అందించారు. రాహుల్ తెవాటియా బ్యాటింగ్ గుర్తుందా? అతను ఆఖరి 5 బంతుల్లో 5 సిక్స్‌లు బాది తన జట్టును గెలిపించాడు. ఆ మ్యాచ్‌లో తొలి 19 బంతుల్లో అతను 8 పరుగులు మాత్రమే చేశాడు.'అని కైఫ్ పేర్కొన్నాడు.ఐపీఎల్ చరిత్రలోనే ఇప్పటి వరకు మొత్తం ఐదుగురు బ్యాటర్లు రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగారు. ఈ రూల్‌ను ఉపయోగించుకున్న తొలి బ్యాటర్‌గా రవిచంద్రన్ అశ్విన్ నిలిచాడు. ఐపీఎల్ 2022 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన అతను రిటైర్డ్ ఔట్‌గా మైదానం వీడాడు. ఐపీఎల్ 2023 సీజన్‌లో అథర్వ టైడ్, సాయి సుదర్శన్ ఈ రూల్‌ను ఉపయోగించారు. తాజా సీజన్‌లో తిలక్ వర్మ, డెవాన్ కాన్వే రిటైర్డ్ ఔటయ్యారు. ఈ ఐదు సందర్భాల్లో ఈ రూల్‌ను ఉపయోగించిన జట్లకు రెండు సార్లు మాత్రమే విజయం దక్కింది.

## ఇండియాతో చారిత్రాత్మక పోరుకు జపాన్ జట్టు ప్రకటన

ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది.మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.

## భారత్‌ను చూసి నేర్చుకోండి

### ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సూచన

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు. 1990ల నుంచి భారత్ తమ క్రికెట్ నిర్మాణంపై దృష్టి పెడుతూ వచ్చిందని, దాని ఫలితాల వల్లే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి గొప్ప ఆటగాళ్లు పుట్టుకొచ్చారని గుర్తుచేశారు. పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం యువ ఆటగాళ్లకు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం చాలా తక్కువగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరం ఆటగాళ్లు ఎక్కువగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యత ఇస్తోన్నారని, దీనివల్ల టెస్ట్ ఫార్మట్ లో రాణించే నైపుణ్యాలు కొరవడుతున్నాయని విశ్లేషించారు. ఒత్తిడిని తట్టుకోలేకపోవడానికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడకపోవడమే కారణమని చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే పీసీబీ తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని మిస్బా సూచించారు. ఆకస్మిక మార్పులతో ఆటగాళ్లలో భయాందోళనలు పెరుగుతాయే ఒరిగేదేమీ ఉండదని, యువ ఆటగాళ్లకు ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడేలా ప్రోత్సహించాలని చెప్పారు.

## రూమర్లకు చెక్ పెట్టిన రాహుల్..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్

స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.

# విశ్వజ

టేస్టీ సొరకాయ హల్వా..ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే..

## ఎలా చేసుకోవాలంటే

సొరకాయ అనగానే చాలామందికి కూర గుర్తుకు వస్తుంది కానీ, ఈ కూరగాయతో అద్భుతమైన హల్వా కూడా తయారు చేయవచ్చు. సొరకాయ హల్వా కేవలం నోటికి రుచికరమైన తీపి వంటకం మాత్రమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే పోషక సమృద్ధిగల వంటకం కూడా. పండుగలకు, ప్రత్యేక సందర్భాలకు లేదా ఇంటికి అతిథులు వచ్చినప్పుడు తయారు చేయడానికి ఇది ఒక అద్భుతమైన ఆప్షన్.ఈ హల్వాను తయారు చేయడం చాలా సులభం. సొరకాయ హల్వాను మీ ఇంట్లోనే సింపుల్ గా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి. సొరకాయ హల్వా తయారీకి కావలసిన పదార్థాలు –గింజలు లేని లేత సొరకాయ: 1 కిలో –చిక్కని పాలు: 2 కప్పులు –చక్కెర: 1.5 కప్పులు –నెయ్యి: 4–5 టేబుల్ స్పూన్లు –యాలకుల పొడి: 1 టీ స్పూన్ –బాదం, జీడిపప్పు, పిస్తా: 1/4 కప్పు –కిస్మిస్ : 2 టేబుల్ స్పూన్లు –కోవా లేదా పాలు మీగడ: 1/4 కప్పు –కుంకుమపువ్వు : 1 టేబుల్ స్పూన్ సొరకాయ హల్వా తయారీ విధానం –సొరకాయను బాగా కడిగి పై తొక్కను చెక్కాలి. –తొక్క తీసిన సొరకాయను నిలువుగా రెండు భాగాలుగా కట్ చేసి లోపల ఉన్న గింజలు, మెత్తని భాగాన్ని తొలగించాలి. –తర్వాత సొరకాయను తురుముకోవాలి. –ఇప్పుడు ఒక మందపాటి అడుగున్న పెద్ద కడాయి స్టవ్ మీద పెట్టి అందులో సొరకాయ తురుము వేసి అందులో పాలు కలపండి. –మీడియం మంట మీద సొరకాయ తరుమును పాలలో ఉడికించడం ప్రారంభించండి. సొరకాయ మెత్తగా అయ్యే వరకు, పాలు పూర్తిగా ఇంకిపోయే వరకు ఉడికించాలి. దీనికి సుమారు 15–20 నిమిషాలు పట్టవచ్చు. మధ్యమధ్యలో అడుగు అంటకుండా కలుపుతుండాలి. –పాలు పూర్తిగా ఇంకిపోయిన తర్వాత అందులో నెయ్యిని వేసి బాగా కలపండి. నెయ్యి కరిగి సొరకాయ తురుము నెయ్యిలో కొద్దిగా వేగే వరకు 5–7 నిమిషాలు ఉడికించండి. ఈ సమయంలో సన్నగా తరిగిన బాదం, జీడిపప్పు,పిస్తా, కిస్మిస్ వేసి ఒక నిమిషం పాటు వేయించండి. –ఇప్పుడు చక్కెర వేసి బాగా కలపండి. పంచదార కరిగి మిశ్రమం చిక్కబడే వరకు, పాన్ నుండి వేరుపడే వరకు ఉడికించాలి. ఇది సుమారు 10–15 నిమిషాలు పడుతుంది. పోషకాల రాగి హల్వా..రుచికి రుచి,ఆరోగ్యానికి ఆరోగ్యం..ఇంట్లోనే ఎలా చేసుకోవాలంటే –చివరగా యాలకుల పొడిని వేసి బాగా కలపండి. మీరు కోవానువేయాలనుకుంటే ఈ దశలో తురిమిన కోవాను వేసి బాగా కలపండి. కోవా కరిగి హల్వాతో కలిసిపోయే వరకు 2–3 నిమిషాలు ఉడికించండి. –రంగు కోసం కుంకుమపువ్వును ఉపయోగిస్తుంటే ఒక టేబుల్ స్పూన్ గోరువెచ్చని పాలలో కొన్ని కుంకుమపువ్వు రేకులను నానబెట్టి హల్వా చివరలో వేసి కలపవచ్చు. ఇది హల్వాకు మంచి బంగారు రంగును ఇస్తుంది. అంతే సొరకాయ హల్వా రెడీ. –సొరకాయలో దాదాపు 92 శాతం నీరు ఉంటుంది. అందువల్ల ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించి వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచడానికి సహాయపడుతుంది. హల్వా రూపంలో తీసుకున్నప్పుడు కూడా ఈ గుణం ఉంటుంది.

# ఇడ్లీ, దోశ,పూరీ అక్కర్లేదు..

## ఉదయం గుప్పెడు శెనగలతో ఆరోగ్యానికి తిరుగులేని బలం!

ప్రస్తుతం దాదాపు అందరిలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ముఖ్యంగా కరోనా తర్వాత నుంచే ఆరోగ్యంపై అటెన్షన్ అందరిలో వచ్చిందనే చెప్పాలి. అయితే ఆరోగ్యకరమైన జీవితం కోసం ఆరోగ్యకరమైన ఫుడ్ తీసుకోవడం తప్పనిసరి. ఏది పడితే అది తిని ఇది కూడా ఆరోగ్యకరమైనదే అని చాలామంది అనుకుంటారు..అయితే అది భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య పరిణామాలకు కారణమవుతుంది. సాధారణంగా మన తెలుగు ప్రజులు పొద్దున్నే ఇడ్లీ,దోశ, పూరీ,వడ,బోండా వంటివి ఎక్కువగా తింటుంటారు. అయితే వీటిన్నింటిన్ని వదిలి పొద్దున్నే గుప్పెడు నానబెట్టిన శెనగలు తినడం వల్ల ఆరోగ్యానికి బోలెడు మేలు జరుగుతుంది. ప్రోటీన్లు, ఫైబర్, ఐరన్, విటమిన్లు,మనరల్స్ పుష్కలంగా ఉండే శెనగలు మీ శరీరాన్ని శక్తివంతం చేయడమే కాకుండా అనేక వ్యాధుల నుండి కూడా కాపాడుతుంది. బలమైన జీర్ణవ్యవస్థ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో జీర్ణ సంబంధిత సమస్యలు చాలా కామన్ అయిపోయింది. అయితే నానబెట్టిన శెనగలు దీనికి చక్కటి పరిష్కారం చూపుతుంది. ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. పేగు కదలికలను సులభతరం చేసి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారం సక్రమంగా జీర్ణం కావడం వల్ల శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి,ఆరోగ్యం మెరుగుపడుతుంది." రక్తంలో చక్కెర నియంత్రణ మధుమేహం లేదా షుగర్ అనేది ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందిని వేధిస్తున్న ఒక తీవ్రమైన సమస్య. నానబెట్టిన శనగపప్పు బ్లడ్ లో షుగర్ లెవల్స్ ని కంట్రోల్ చేయడంలో సహాయపడుతుంది. దీనిలో గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తుంది. తద్వారా చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఒక అద్భుతమైన ఆహారం. బరువు తగ్గడంలో సాయం నానబెట్టిన శనగలు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇందులో ప్రోటీన్లు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉంటుంది. దీనివల్ల మీరు తరచుగా తినాలనే కోరికను నియంత్రించవచ్చు, అదనపు కేలరీలు తీసుకోకుండా ఉండవచ్చు. రోగనిరోధక శక్తి బలమైన రోగనిరోధక శక్తి మనల్ని అనేక వ్యాధుల నుండి కాపాడుతుంది. నానబెట్టిన శనగలలో ఐరన్, భాస్వరం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన మినరల్స్, విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని రోగనిరోధక కణాలను బలోపేతం చేస్తాయి. తద్వారా శరీరం న్ఫెక్షన్లు,వ్యాధులతో సమర్థవంతంగా పోరాడగలదు. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్ లో ఉండటం వల్ల గుండెపోటు, ఇతర గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది. చర్మం,జుట్టుకు మెరుపు ఆరోగ్యకరమైన చర్మం, మెరిసే జుట్టు కావాలని అందరూ కోరుకుంటారు. నానబెట్టిన శనగపప్పులో ఉండే ప్రోటీన్లు, యాంటీఆక్సిడెంట్లు మీ చర్మాన్ని కాంతివంతంగా చేస్తాయి. అంతేకాకుండా ఇది జుట్టు మూలాలను బలోపేతం చేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది, ఆరోగ్యంగా పెరిగేలా చేస్తుంది. "ఓట్స్ ఇడ్లీ ఎప్పుడైనా తిన్నారా? పొద్దున్నే అసలు తినాల్సిందే ఇది కదా..ఏం టేస్టూ,ఎన్ని బెనిఫిట్స్..ఎలా చేయాలంటే " నానబెట్టిన శనగపప్పును ఎలా తీసుకోవాలి? రాత్రిపూట ఒక కప్పు శనగపప్పును శుభ్రమైన నీటిలో నానబెట్టండి. ఉదయం లేచిన తర్వాత వాటిని బాగా కడిగి ఖాళీ కడుపుతో తినండి. మీ రుచికి అనుగుణంగా కొద్దిగా ఉప్పు, అల్లం ముక్కలు లేదా కావాలనుకుంటే తేనెను కూడా కలుపుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. %ణఱంషశ్రీఝఱఎవతీ%: ఈ ఆర్టికల్ లో అందించిన సమాచారం సాధారణ సమాచారం,విద్యా ప్రయోజనాల కోసం మాత్రమే. ఇది వృత్తిపరమైన వైద్య సలహా, రోగ నిర్ధారణ లేదా ట్రీట్మెంట్ కు ప్రత్యామ్నాయంగా ఉద్దేశించబడలేదు. వైద్య పరిస్థితికి సంబంధించి మీకు ఏవైనా ప్రశ్నలు ఉంటే మీ డాక్టర్ లేదా సంబంధిత నిపుణుల సలహా తీసుకోండి.

# నిద్రను మెరుగుపరిచే ఆహార పదార్థాలు

కొన్నిరకాల ఆహార పదార్థాలు ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. మరికొన్ని రోగాలను తగ్గిస్తే.. ఇంకొన్ని మానసిక ఉన్నతికి సాయపడతాయి. అలాగే.. నిద్రను మెరుగుపరిచే ఆహార పదార్థాలు ఉన్నాయి. వాటిని క్రమం తప్పకుండా తీసుకుంటే.. కంటినిండా నిద్రపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చమోలీ టీ: ఈ హెర్బల్ టీ.. అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో 'అపిజెనిన్' అనే యాంటి ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది నిద్రలేమికి కారణమయ్యే మెదడులోని కొన్ని గ్రాహకాలను అడ్డుకుంటుంది. తద్వారా నిద్రలేమిని తగ్గిస్తుంది. కివీ పండ్లు: 'సెరటోనిన్' అనేది మెదడులో ఉండే ఒక రకమైన రసాయనం. ఇది నిద్ర నాణ్యతలో కీలక పాత్ర పోషిస్తుంది. పడుకునే ముందు రెండు కివీ పండ్లు తీసుకుంటే.. సెరటోనిన్ ఉత్పత్తి పెరుగుతుంది. కాబట్టి, మంచినిద్ర పడుతుంది. వాల్‌నట్స్/బాదం: వీటిలో పుష్కలంగా లభించే మెగ్నీషియం.. కండరాల సడలింపునకు సాయపడుతుంది. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. అరటిపండ్లు: పొటాషియం, మెగ్నీషియంతో నిండిన అరటిపండ్లు కూడా నిద్రను ప్రోత్సహిస్తాయి. చేపలు: సాల్మన్, ట్యూనా, ట్రౌట్‌లాంటి చేపల్లో విటమిన్ డి పుష్కలంగా లభిస్తుంది. ఇది నిద్రరావడాన్ని ప్రోత్సహిస్తుంది. పాలు: పడుకునే ముందు ఓ గ్లాసు గోరువెచ్చని పాలు తాగితే.. ఇట్టే నిద్రపట్టేస్తుంది. పాలు.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అదే సమయంలో.. నిద్రకోసం మరిన్ని చిట్కాలను పాటించాలి. రోజూ ఒకే సమయానికి నిద్రకు ఉపక్రమించాలి. గంట ముందే భోజనం ముగించేయాలి. రాత్రిపూట స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి. ఇక నిద్రకు భంగం కలిగించే కెఫీన్, ఆల్కహాల్ లాంటివాటికి దూరంగా ఉండాలి. రాత్రి భోజనం స్వల్పంగా చేయాలి.

# మార్కెట్

### కిలో రూ.1,02,100..

## వెండి ధర పరుగో పరుగు

### ఒక్కరోజే రూ.1,900 పెరిగిన రేటు

### రూ.1,02,100 స్థాయికి కిలో విలువ

న్యూఢిల్లీ : దేశీయ మార్కెట్‌లో బుధవారం వెండి ధరలు పరుగులు పెట్టాయి. ఈ ఒక్కరోజే ఢిల్లీలో కిలో ధర ఏకంగా రూ.1,900 ఎగిసి రూ.1,02,100కు చేరింది. సాధారణ కొనుగోలుదారులు, పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ పెరిగిందని అఖిల భారత సరఫా అసోసియేషన తెలిపింది. కాగా, ఈ ఏడాది మార్చి 19న మునుపెన్నడూ లేనివిధంగా కిలో వెండి ధర ఆల్‌టైమ్ హై రికార్డును నెలకొల్పుతూ రూ.1,03,500 పలికిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా ధరలు ఇలాగే పెరుగుతూపోతే ఆ రికార్డును అధిగమించడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పసిడి ధరలూ.. బంగారం ధరలూ క్రమేణా పెరుగుతున్నాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పసిడి 10 గ్రాములు రూ.260 పెరిగి రూ.99,260గా నమోదైంది. ఇక హైదరాబాద్ విషయానికొస్తే.. 24 క్యారెట్ తులం రూ.110 అందుకొని రూ.95,450కి చేరింది. నగలు, ఇతరత్రా ఆభరణాలకు వినియోగించే 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.100 పెరిగి రూ.90,900గా ఉన్నది. ఇక గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 9.43 డాలర్లు పుంజుకొని 3,362.6 డాలర్లుగా ట్రేడైంది. దేశీయ మార్కెట్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 22న ఆల్‌టైమ్ హైని తాకుతూ తులం 24 క్యారెట్ బంగారం ధర తొలిసారి రూ.1,01,600 పలికిన సంగతి విదితమే.

# మనోళ్ల పైసలపైనా పన్ను!

అమెరికా నుంచి భారత్‌కు వచ్చే రెమిటెన్స్‌లనూ వదలని ట్రంప్
3.5 శాతం ఎక్సైజ్ ట్యాక్స్ వేసే దిశగా అడుగులు
అమల్లోకి వస్తే ప్రతీ రూ.లక్షపై రూ.3,500 పన్ను భారం

ప్రతీకార సుంకాలతో హల్‌చల్ సృష్టించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇక ఇతర పన్నులపై దృష్టిపెట్టారు. మా దేశం మాకే సొంతం అన్న నినాదంతో స్వార్థపూరిత నిర్ణయాలకు దిగుతున్న అగ్రరాజ్యాధినేత.. వలసదారుల కష్టార్జితాన్నీ దోచుకొనేందుకు సిద్ధమయ్యారు. రెమిటెన్స్‌లపై 3.5 శాతం ఎక్సైజ్ ట్యాక్స్‌ను ప్రతిపాదించారు మరి. ఇది అమల్లోకి వస్తే అమెరికాలోని భారతీయులు స్వదేశానికి పంపే ప్రతీ లక్ష రూపాయలపై పన్ను రూపంలో రూ.3,500 నష్టపోవాల్సి వస్తుంది.

న్యూఢిల్లీ : అమెరికా సంపదను అమెరికన్లుగాక ఇతరులే అనుభవిస్తున్నారని రగిలిపోతున్న ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో దెబ్బకొట్టేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే ప్రపంచ దేశాలను ప్రతీకార సుంకాలతో షేక్ చేసిన ఆయన.. వలసదారుల కష్టార్జితాన్నీ వదిలిపెట్టడం లేదు. ఈ క్రమంలోనే రెమిటెన్స్‌లపై 3.5 శాతం ఎక్సైజ్ ట్యాక్స్‌ను ప్రతిపాదించారు. ఇది చట్ట రూపం దాల్చితే ఎన్నారై (ప్రవాస భారతీయులు)లు భారత్‌లోని తమ కుటుంబ సభ్యులకు పంపించే నగదుపై పన్ను భారం పడనున్నది. ఇక్కడకు వచ్చే ప్రతీ లక్ష రూపాయలపై రూ.3,500 ట్యాక్స్‌ను చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ.10 లక్షలకు రూ.35 వేలు, కోటి రూపాయలకు రూ.3.5 లక్షలు నష్టపోవాల్సి వస్తుందన్నమాట.

ఎన్నారైల్లో ఆందోళన

అమెరికాలో ఎక్కువగా నివసిస్తున్న ఇతర దేశస్తుల్లో భారతీయులు కూడా ఉన్నారు. నిజానికి అమెరికా సంపద సృష్టిలో వలసదారుల పాత్ర చాలా కీలకం. కానీ దీన్ని మరిచి కక్ష సాధింపు చర్యలకు ట్రంప్ దిగుతుండటం ఇప్పుడు అక్కడి వలసదారుల్లో, ప్రధానంగా ఎన్నారైల్లో ఆందోళన కలిగిస్తున్నది. ఎందుకంటే అమెరికాలో ఉంటున్న భారతీయులు తమ సంపాదనలో ఎక్కువ శాతం భారత్‌లోని తమ కుటుంబాలకే పంపుతూంటారు. దీంతో ట్రంప్ ట్యాక్స్ వీరి కష్టార్జితాన్ని మింగేసేలా తయారవుతున్నది. నిజానికి తొలుత 5 శాతం ట్యాక్స్‌ను ప్రతిపాదించారు. కాగా, ఈ ప్రతిపాదిత ట్యాక్స్.. ఇప్పుడున్న ఆదాయ పన్నుల కంటే భారంగా మారుతున్నది. హెచ్–1బీ, ఎల్–1, ఎఫ్–1 వీసాలపై వచ్చే ఎన్నారైలుసహా గ్రీన్‌కార్డ్ హోల్డర్స్‌నూ అధికంగా ప్రభావితం చేస్తున్నది.

నిపుణులేమంటున్నారు?

రెమిటెన్స్‌లపై అమెరికా ప్రతిపాదించిన ఎక్సైజ్ ట్యాక్స్ అమలైతే.. భారత్ అనేక రకాలుగా ప్రభావితం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా భారత్‌లోని ఎన్నారైల కుటుంబాలకు అందే నగదు మొత్తాలు తగ్గిపోనున్నాయి. అలాగే వారి కొనుగోలు శక్తి కూడా పడిపోనున్నది. స్థిరాస్థి కొనుగోళ్లు క్షీణిస్తాయని, ఇది నిర్మాణ, దాని అనుబంధ రంగాల వృద్ధిని దెబ్బతీస్తుందని కూడా చెప్తున్నారు. ప్రస్తుతం చాలామంది ఎన్నారైలు తాము పంపించే సొమ్ముతో భారత్‌లో ఇండ్లు, ఫ్లాట్లు, భూములనే కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు మరి. చివరకు ఇది భారత్‌లో పారిశ్రామికోత్పత్తి, వ్యాపార లావాదేవీలు, జీడీపీ వృద్ధిరేటుపైనా ప్రభావం చూపవచ్చని అంటున్నారు. కాగా, భారత్–అమెరికా ద్వంద్వ పన్నుల నిరోధక ఒప్పందానికి (డీటీఏఏ) అమెరికా రెమిటెన్స్ ట్యాక్స్ కొత్త సవాళ్లను తేవచ్చన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. అయితే ఆదాయ పన్నుకు మాత్రమే డీటీఏఏ వర్తిస్తుందని, ఎక్సైజ్ లేదా లావాదేవీ సుంకాలకు కాదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. దీంతో పన్ను పోటు తప్పేలా లేదు.

## 25% లేదా 50% రెపో కట్!

### రేపే ఆర్బీఐ పాలసీ నిర్ణయం

ముంబై : గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై వడ్డీరేట్లు భారీగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈసారి ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటుకు 50 బేసిస్ పాయింట్లు కోతపెట్టే వీలుందని తెలుస్తున్నది మరి. బుధవారం ఆర్బీఐ ఈ ఏడాదికిగాను మూడో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ప్రారంబి ంచింది. శుక్రవారం ఇందులో తీసుకున్న నిర్ణయాలు వెల్లడి కానున్నాయి. ఈ క్రమంలోనే ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) 25 బేసిస్ పాయింట్లు లేదా కుదిరితే 50 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చన్న అంచనాలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే గత రెండు ద్రవ్యసమీక్షల్లో (ఫిబ్రవరి, ఏప్రిల్) రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 50 బేసిస్ పాయింట్లు ఆర్బీఐ దించింది. దీంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6 శాతానికి దిగొచ్చింది. కాగా, ఈ ఏడాది జరిగే మరో 3 ద్రవ్యసమీక్షల్లోనూ వడ్డీరేట్ల తగ్గింపులకు చాన్స్ ఉందని ఆర్థిక, బ్యాంకింగ్ నిపుణులు అభిప్రాయప డుతున్నారు.

# ఆంధ్రప్రదేశ్

## తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో దోషికి ఉరిశిక్ష

### తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు సంచలన

తిరునల్వేలి : మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

### సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది

### ఎన్?సీఈఆర్‌టీపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 : విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది. అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

## ఎన్సీసీఎఫ్ ఎండీతో మంత్రి మనోహర్ చర్చలు

### రాష్ట్రంలో నిత్యావసరాల సరఫరా, ధరల నియంత్రణపై చర్చ

అమరావతి : ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సిసిఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు, ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనలో కేంద్ర ప్రభుత్వ సంస్థల సహకారాన్ని మరింత విస్తృతం చేస్తూ, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా ముందుకు వెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేతోనూ మంత్రి నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ధ్యేయంగా, కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం, సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఈ భేటీలో నిర్ణయించారు.

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

**సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేస్తాం**
**ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**
**కోనసీమలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ**

అమరావతి : సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు. "రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు. భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి (1908) 22ఏ(1) నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నామని, దీని ద్వారా 1410 మందికి చెందిన 56.37 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నామని ప్రకటించారు. "గొడ్డలి పార్టీ తారుమారు చేసిన రికార్డులను ప్రక్షాళన చేసి భూ సమస్యలను కొలిక్కి తెస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. భూమి భద్రతతో పాటు నీటి భద్రతకు కూడా తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో వృథాగా కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఢిల్లీలో సంజీవనిలా పనిచేసిందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన గ్రిడ్ ఆధునీకరణ, 3-ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీశ్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భక్తుడు మర్చిపోయిన వస్తువులు అప్పగింత

### నిజాయతీ చాటుకున్న టీటీడీ సిబ్బంది

అమరావతి : తిరుమల కొండపై విధులు నిర్వర్తించే టీటీడీ సిబ్బంది మరోసారి తమ నిజాయతీని, అప్రమత్తతను చాటుకున్నారు. ఓ భక్తుడు పొరపాటున మర్చిపోయిన సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగును విజిలెన్స్ సిబ్బంది సురక్షితంగా అతనికి అప్పగించారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం తిరుమల మార్గంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడుకు చెందిన పి. కార్తికేయన్ అనే భక్తుడు తన కుటుంబంతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో అలిపిరి తనిఖీ కేంద్రం (చెక్పాయింట్) వద్ద తనిఖీల అనంతరం, ఆయన తన బ్యాగును అక్కడే మర్చిపోయి తిరుమలకు వెళ్లిపోయారు. విధి నిర్వహణలో ఉన్న విజిలెన్స్ సిబ్బంది అక్కడ పడి ఉన్న బ్యాగును గుర్తించారు. దాన్ని పరిశీలించగా, అందులో విలువైన బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు ఉన్నట్లు గమనించారు. వెంటనే బ్యాగులో లభించిన వివరాల ఆధారంగా భక్తుడు కార్తికేయన్‌ను ఫోన్‌లో సంప్రదించారు. బ్యాగు తమ వద్ద సురక్షితంగా ఉందని, తిరిగి వచ్చి తీసుకువెళ్లాలని సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కార్తికేయన్ వెంటనే తనిఖీ కేంద్రానికి చేరుకున్నారు. అధికారులు బ్యాగులోని వస్తువుల గురించి అడగగా, ఆయన అన్నింటినీ సరిగ్గా వివరించారు. ఆయన చెప్పిన వివరాలు సరిపోలడంతో, సిబ్బంది బ్యాగును అతనికి అందజేశారు. బ్యాగులో రూ.10,900 నగదు, రెండు గాజులు, ఒక బంగారు గొలుసు, రెండు బంగారు ఉంగరాలు ఉన్నాయని టీటీడీ సెక్టార్-5 ఏవీఎస్వో రమేశ్ తెలిపారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. తన విలువైన వస్తువులు తిరిగి దొరకడంతో భక్తుడు కార్తికేయన్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇంతటి అప్రమత్తత, నిజాయతీతో వ్యవహరించి తన బ్యాగును భద్రంగా అప్పగించిన టీటీడీ విజిలెన్స్ అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వైసీపీకి రాజీనామా చేసిన బొత్స మేనల్లుడు

అమరావతి : వైసీపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## చంద్రబాబు అపాయింట్‌మెంట్ కోరిన దస్తగిరి

అమరావతి : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు మంగళవారం అమరావతికి చేరుకున్నాడు. గత ప్రభుత్వంలో తనను వేధించిన అధికారులే ఇప్పటికీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎంకు ఒక వినతిపత్రం సమర్పించేందుకు అమరావతి వచ్చినట్టు వెల్లడించాడు. తన భార్య షేక్ షబానాతో కలిసి వచ్చిన దస్తగిరి, సీఎం అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు మీడియాకు తెలిపాడు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఇప్పుడు జగన్ కు తాను నైతిక విలువలు చెప్పాల్సి వస్తోందని, జగన్ ఆ స్థాయికి దిగజారారని ఎద్దేవా చేశాడు. రాష్ట్రం గురించి మాట్లాడే ముందు, బాబాయి కూతురికి న్యాయం చేయాలని హితవు పలికాడు. తాను న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నుంచి వకాల్తా తీసుకున్నట్లు నిరూపిస్తే జైలుకు వెళ్లడానికి సిద్ధమని, ఒకవేళ నిరూపించలేకపోతే జగన్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని సవాల్ విసిరాడు. వివేకా హత్య కేసులో జగన్, ఆయన భార్య భారతి విచారణ సంస్థలకు పూర్తిగా సహకరించాలని దస్తగిరి డిమాండ్ చేశాడు. అంతేకాకుండా, వివేకా హత్య కేసు, సంబంధిత మనీలాండరింగ్ వ్యవహారాలపై తన వద్ద ఉన్న కీలక వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తానని దస్తగిరి స్పష్టం చేశాడు. "గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నన్ను చంపేస్తామని బెదిరించిన అధికారులే ఇప్పటికీ నా వెంటపడుతున్నారు. వారి వేధింపులు భరించలేకపోతున్నాం. అందుకే మా గోడును సీఎంతో చెప్పుకోవడానికి వచ్చాం" అని దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశాడు. దస్తగిరి భార్య షబానా మాట్లాడుతూ, తాము పులివెందులకు వెళ్లాలంటేనే భయంగా ఉందని కన్నీటిపర్యంతమైంది. తమ కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం పొందాలనే ఆశతో అమరావతికి వచ్చామని ఆమె తెలిపింది. సీఎంను కలిసేందుకు అనుమతి ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేసింది.

## కెనడా ఉత్పత్తులపై అమెరికా నిషేధం

### అమల్లోకి తెచ్చిన ప్రతీకార సుంకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09 : అమెరికా- కెనడా మధ్య వాణిజ్య వివాదం మరింత ముదిరింది. కెనడా విధించిన ప్రతీకార సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వాహనాలు, ఆటో విడిభాగాలు, మద్యం, పాల ఉత్పత్తులపై ఆంక్షలు విధిస్తూ ఏకంగా ఐదు ఉత్తర్వులు జారీ చేశారు. భారీ, దీర్ఘకాలిక అమెరికా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కెనడియన్ ఉత్పత్తులపై నిషేధం విధించాలని జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించారు. అమెరికా ఉత్పత్తులకు కెనడా పూర్తి న్యాయమైన పరస్పర ప్రయోజనం కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ వాహనాలు, ఆటోమొబైల్ విడిభాగాలను అమెరికాలోకి దిగుమతి చేయకుండా నిషేధించేలా ట్రంప్ తొలి ఉత్తర్వును జారీ చేశారు. కెనడాలోని కొన్ని ప్రావిన్సులు అమెరికా బీర్, వైన్, స్పిరిట్స్ పంపిణీ, రిటైల్ విక్రయాలు, కొనుగోళ్లపై ఆంక్షలు విధిస్తున్నాయని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా కొన్ని కెనడియన్ ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధించే పరిధిని మార్చుతూ ట్రంప్ రెండో ఉత్తర్వు జారీ చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ డెయిరీ ఉత్పత్తులను అమెరికాలోకి దిగుమతి చేసుకోకుండా నేరుగా నిషేధిస్తూ మూడో ఉత్తర్వు జారీ చేశారు. అమెరికా మద్యం ఉత్పత్తులపై కెనడాలోని ప్రావిన్సులు విధిస్తున్న ఆంక్షలకు ప్రతిగా, ఎంపిక చేసిన కెనడియన్ మద్యం ఉత్పత్తుల దిగుమతులను నిషేధిస్తూ మరో ఉత్తర్వు తీసుకొచ్చారు. మోటార్ వాహనాల వివాదానికి సంబంధించిన అదనపు సుంకాల పరిధిని కూడా ఐదో ఉత్తర్వుతో మార్చారు. ఇదే సమయంలో అమెరికా ప్రభుత్వ ప్రధాన కొనుగోలు వ్యవస్థ నుంచి కెనడియన్ ఉత్పత్తులను తొలగించాలని ట్రంప్ ఆదేశించారు. జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్ (జీఎస్?ఏ), యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్?టీఆర్)లు ఈ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. కెనడా కూడా అమెరికా సంస్థలు, రైతులకు సమానమైన మార్కెట్ అవకాశాలు కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు.

## గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

**- కళాశాలను ఏర్పాటు చేసింది టీడీపీ.. నిర్వీర్యం చేసింది వైసీపీ**

**- ఆరు నెలల్లో 253 బోధనా పోస్టుల భర్తీ.. వీసీఐ అనుమతుల పునరుద్ధరణ**

**- వైసీపీ నేతలు ముందు తమ ఐదేళ్ల పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలి:**

**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

అమరావతి : గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు లభించకపోవడంపై వైసీపీ నేతలు మాట్లాడటం చూస్తుంటే... అసలు వారికి ఆ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఎవరు ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కళాశాల అభివృద్ధిని పట్టించుకోని వారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రజలకు మెరుగైన పశువైద్య సేవలు అందించడంతో పాటు, ఈ ప్రాంతంలో వెటర్నరీ విద్యను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2016లో గరివిడిలో వెటర్నరీ కళాశాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అని అచ్చెన్నాయుడు తెలిపారు. 2017 ఏప్రిల్‌లో రూ.81.72 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, 2018 ఫిబ్రవరిలో సుమారు 90 ఎకరాల భూమిని కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన ఐదేళ్ల సమయం అధికారంలో ఉన్న వైసీపీ ఏం చేసింది? అని మంత్రి నిలదీశారు. ఐదేళ్లలో ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా?అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చారా? వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించారా? నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారా? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారా? ఈ ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2024 ఆగస్టు నాటికి పూర్తికావాల్సిన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని స్పష్టం చేశారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ప్రధాన లోపాలు లేవని తాజా వీసీఐ పరిశీలన స్పష్టం చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, బాలురు, బాలికల వసతిగృహాల నిర్మాణ పనులను పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 99 శాతం మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని తెలిపారు. కళాశాలలో సిబ్బంది కొరతను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వీసీఐ సూచనల మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి మొత్తం బోధనా సిబ్బంది సంఖ్యను 77కు పెంచామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రెగ్యులర్ నియామక ప్రక్రియలో ఆలస్యం జరిగిందని, అయితే ఆరు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తి చేసి వీసీఐ అనుమతులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం గత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మంత్రి మండిపడ్డారు. గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైన బోధనా సిబ్బంది నియామకాలను పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఇకనైనా వైసీపీ నేతలు విమర్శలు చేసే ముందు తమ ఐదేళ్ల పాలనను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు.

## భన్సాలీతో కలిసి పనిచేయబోతున్నారా?

బాలీవుడ్ నటి కరీనా కపూర్ మరియు ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత ఒక కొత్త ప్రాజెక్ట్ పై చర్చలు జరుగుతున్నాయా? ఇటీవల కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఈ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజమైతే, కరీనా మరియు భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత జరిగే మొదటి సహకారం అవుతుంది, ఎందుకంటే వారు 'దేవదాస్' సినిమా సమయంలో ఒక గొడవకు గురయ్యారు. సెప్టెంబర్ 8న కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు పాస్టెల్ బ్లూ సూట్ ధరించి కనిపించింది. ఆమె పాపారాజ్జీకి ఫోటోలకు నిలబడలేదు. సంజయ్ లీలా భన్సాలీ తన తదుపరి చిత్రంలో మహిళా నాయకత్వ పాత్ర కోసం కరీనాను సంప్రదించినట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమె తమిళ నటుడు ధనుష్‌తో కలిసి నటించనుంది, అయితే అన్ని విషయాలు బాగా జరిగితేనే. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు ఆమెకు ముఖ్యమైన పాత్ర ఉండబోతుంది. కరీనా ఈ చిత్రానికి ఆసక్తి చూపించినప్పటికీ, ఆమె ఇంకా సంతకం చేయలేదు. ఆమె తేదీలు, ఫీజులు మరియు ఇతర వివరాల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం ఒక పౌరాణిక సాహస కథగా ఉంటుందని సమాచారం, ఇది అటవీ ప్రాంతంలో జరుగుతుంది. కథ అధికారికంగా వెల్లడించబడలేదు, కానీ ఈ చిత్రంలో ఒక ఏనుగు ముఖ్యమైన పాత్ర పోషించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. భన్సాలీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు, కాగా పి.ఎస్. మిత్రన్ దీనిని దర్శకత్వం వహించనున్నారు. ప్రాజెక్ట్ ప్రస్తుతం రచనలో ఉంది, ప్రీ-ప్రొడక్షన్ ఈ సంవత్సరం చివర్లో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. షూటింగ్ 2027 జనవరిలో ప్రారంభమవుతుందని సమాచారం.



## యానిమల్‌తో ఎంతో నేర్చుకున్నా: తృప్తి దిమ్రీ

యానిమల్'తో సూపర్ సక్సెస్ సొంతం చేసుకున్న నటి త్రిప్తి దిమ్రీ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె 'యానిమల్ పార్క్' గురించి స్పందించారు. రణ్‌బీర్ కపూర్, రష్మిక జంటగా నటించిన యాక్షన్ డ్రామా 'యానిమల్' ఇందులో జోయాగా కనిపించి యువత మనసు దోచేశారు నటి త్రిప్తి దిమ్రీ. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొని.. 'యానిమల్'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ సినిమా తన కెరీర్‌కు ఏవిధంగా ఉపయోగపడిందనేది చెప్పారు. 'యానిమల్ పార్క్' గురించీ మాట్లాడారు. యానిమల్' నా కెరీర్‌కు ఎంతో ఉపయోగపడింది. దాని తర్వాత నాకు అభిమానులు ఎక్కువయ్యారు. నా గత చిత్రాలను చూస్తున్నారు. అందులో భాగమైనందుకు ఆనందంగా ఉన్నా. ఎంతోమంది గొప్ప నటీనటులతో వర్క్ చేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నా. 'యానిమల్'ను సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించారు. తండ్రీ తనయుల సెంటిమెంట్‌తో రూపొందించారు. ఇందులో తీవ్ర హింసను ప్రోత్సహించడం ఏం బాలేదంటూ గతంలో పలువురు బాలీవుడ్ దర్శక – నిర్మాతలు, రచయితలు విమర్శలు చేశారు. 'యానిమల్'కు కొనసాగింపుగా 'యానిమల్ పార్క్' రానుంది. 'యానిమల్ పార్క్' చిత్రీకరణను 2026లో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. మొదటిభాగం కన్నా మరింత భారీగా.. హింసాత్మకంగా.. ప్రేక్షకుల ఊహాలకు అందని యాక్షన్ సన్నివేశాలతో దీన్ని తీర్చిదిద్దుతున్నా' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సందీప్‌రెడ్డి వంగా తెలిపారు.

## 'రణబాలి'లో యోధుడిగా విజయ్

విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'రణబాలి'. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 1854-1878ల నాటి బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో, రాయలసీమ ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. ఇందులో విజయ్ పవర్‌ఫుల్ యోధుడిగా కనిపిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా కానుకగా విడుదల కానుంది. వారు ఆ కథను పాతిపెట్టారు.. వారు ఆ పేరును చెరిపివేశారు. వారు తమ పాపాలను తుడిచిపెట్టారు. కానీ అతని రౌద్రాగ్నిని మాత్రం ఎప్పటికీ పాతిపెట్టలేకపోయారు. జానపద గాథలు, చరిత్ర అతన్ని ఎప్పటికీ మరువవు. రణబాలి.. ఆ యోధుడి ప్రతిజ్ఞ" అని మేకర్స్ పేర్కొన్నారు. "అతిథులుగా వచ్చి, అణచివేతదారులుగా మిగిలిపోయిన వారిని. రక్తం చిందించాలని నిర్ణయించుకున్న మన గ్రామాల్లోని ఆ మనుషులను.. ఎప్పటికీ మర్చిపోవద్దు" అని విజయ్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. 1854 - 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రను రష్మిక పోషించారు. అజయ్ - అతుల్ సంగీతం సమకూర్చగా.. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు.'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని ౘ వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్ - రష్మిక కలిసి నటిస్తున్న సినిమా ఇది. భార్యాభర్తలుగా మారిన తర్వాత విరోష్ నుంచి రాబోయే తొలి సినిమా కావడంతో అభిమానులు ఎగ్జైటెడ్ గా ఉన్నారు.

## నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న 'మండాడి'

సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'మండాడి' నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి ఈ సినిమాను అత్యంత భారీ ఎత్తున విడుదల చేస్తోంది. తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకి యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. మూవీ చూసిన సెన్సార్ టీం సభ్యులు అద్భుతంగా వచ్చిందని అభినందించారు. ముఖ్యంగా ఇందులో వచ్చే బోట్ సీక్వెన్సెస్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయని, థియేటర్లలో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టడం ఖాయమని కొనియాడారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, మైండ్ బ్లోయింగ్ ట్రైలర్ సినిమాపై హైప్‌ను రెట్టింపు చేశాయి. మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఎస్.ఆర్. కథిర్ విజువల్స్ ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో గ్రాండ్‌గా, విజువల్ ఫీస్ట్‌లా మలిచాయి.పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బరాయన్, మహేష్ మాథ్యూ కంపోజ్ చేసిన యాక్షన్ సీక్వెన్సులు మాస్, యాక్షన్ ప్రియులను థ్రిల్ చేయనున్నాయి. స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించడం ఈ ప్రాజెక్ట్‌కి బలాన్ని చేకూర్చింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ అవుతున్న ఈ చిత్రానికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్భుతంగా జరుగుతున్నాయి. బుక్ మై షోలో ప్రతి గంటకూ వేలాది టికెట్లు అమ్ముడవుతుండటం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. సుహాస్, సూరి ఇద్దరి కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించే చిత్రంగా నిలవబోతోంది.

## నా మానసిక ధైర్యాన్ని దెబ్బతీశాయి

సినీ పరిశ్రమలో విజయాలు ఎంత గుర్తింపు తీసుకొస్తాయో... పరాజయాలు అంతకంటే ఎక్కువ ఒత్తిడిని మోసుకొస్తాయి. ముఖ్యంగా సోషల్ మీడియా హవా నడుస్తున్న నేటికాలంలో సినిమా ఫలితం తేడా కొడితే నటీనటులపై వచ్చే ట్రోలింగ్ వారిని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తుంది. ఇలాగే హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజా ఇంటర్వ్యూలో చెబుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా అభిలాష్ జోషి దర్శకత్వంలో సుమారు రూ.50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ' కింగ్ ఆఫ్ కోథా ' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమా పరాజయం తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై చూపిన ప్రతికూల ప్రభావం గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 2023లో భారీ హైప్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కింగ్ ఆఫ్ కోథా' బాక్సాఫీస్ వద్ద చతికిలబడటంతో పాటు, నెట్టింట తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంది. చిత్ర బృందంతో పాటు తనపై వచ్చిన ట్రోలింగ్ తనను తీవ్రంగా కలచివేసిందని ఐశ్వర్య తెలిపారు. సినిమాలో తన నటన, సంభాషణలు పలికే తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుల విమర్శలు నిజమేనేమో అని తానూ భావించినట్లు చెప్పారు. ముఖ్యంగా దుల్కర్ పాత్రను ఉద్దేశించి తాను పలికిన 'రాజువెట్టా' అనే సంభాషణ నెట్టింట దారుణంగా ట్రోలింగ్‌కు గురైందని గుర్తుచేసుకున్నారు. ఈ నెగెటివిటీ అక్కడితో ఆగకుండా షూటింగ్ లొకేషన్లకూ పాకిందని ఐశ్వర్య గుర్తు చేసుకున్నారు. 'హలో మమ్మీ' సినిమా షూటింగ్ సమయంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ తనను ఉద్దేశపూర్వకంగా ఆ పేరుతో పిలిచి గేలి చేయడంతో తీవ్రంగా మనస్తాపం చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సినిమా తెచ్చిన ప్రతికూల ప్రభావంతో మలయాళ చిత్ర పరిశ్రమలో దర్శకనిర్మాతలు తనకు కొత్త అవకాశాలు ఇచ్చేందుకు వెనుకాడేవారని పేర్కొన్నారు. ఈ ట్రోల్స్ తెచ్చిన భయం ఎంతవరకు వెళ్లిందంటే, ఆ తర్వాత దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఒక కమర్షియల్ యాడ్‌లో నటించే అవకాశం వచ్చినా ఆమె రిజెక్ట్ చేశారట. 'నేను ఆయనతో నటిస్తే మళ్లీ ట్రోలింగ్ మొదలై మీ ప్రాజెక్ట్‌కే ఇబ్బందిగా మారుతుంది' అని చెప్పి మరీ ఆ ఆఫర్‌ను వదులుకున్నానని, ఈ చేదు అనుభవం వల్ల దుల్కర్‌తో మళ్లీ కలిసి పనిచేయగలనా అనే సందేహం కలుగుతోందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. గత చేదు జ్ఞాపకాలను అధిగమిస్తూ ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి ఇతర పరిశ్రమల్లో బలమైన ముద్ర వేస్తున్నారు. తమిళంలో ఇటీవల 'గట్ట కుస్తీ-2'తో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, తెలుగులో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఎదుగుతున్నారు. సాయి దుర్గా తేజ్ సరసన ఆమె నటిస్తున్న భారీ చిత్రం 'సంబరాల ఏటి గట్టు' షూటింగ్ చివరి దశకు చేరుకుని, వచ్చే సంక్రాంతి బరిలో దిగేందుకు సిద్ధమవుతోంది.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056